జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | గురువారం 8 మే 2025 | సంపుటి : 15 | సంచిక : 239 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED
గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.
ప్రజాజ్యోతి
సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

OPERATION SINDOOR

# ఆపరేషన్ సిందూర్



- 25 నిమిషాల్లోనే ఉగ్రమూకల ఖేల్ ఖతం
- 25 నిమిషాల్లోనే 9 పాక్ ఉగ్ర స్థావరాల విధ్వంసం
- భారత ఆర్మీ ఆపరేషన్ సిందూర్ విజయవంతం
- 24 మిస్సైల్స్, ఉపగ్రహ గైడెడ్ గ్లైడ్ బాంబులతో తడాఖా

## భారత్ మెరుపుదాడిలో 70 మంది ఉగ్రవాదుల హతం..?

పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారంతో రగిలిపోయిన భారత్?- 25 నిమిషాల్లో 24 క్షిపణులతో దాడులు చేసి ఉగ్రవాద మూకల ఆటకట్టించింది. చెప్పినట్టే చేసి టెర్రరిస్టులకే టెర్రర్ అంటే ఏంటో చూపించింది. బుధవారం తెల్లవారుజామున 1:05 గంటల నుంచి 1:30 గంటల వరకు 25 నిమిషాల పాటు ఆపరేషన్ జరగ్గా, 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడానికి 24 క్షిపణులను భారత్ ప్రయోగించింది. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన సంయుక్తంగా, పరస్పర సమన్వయంతో నిర్వహించాయి.




## మసూద్ అజర్ ఫ్యామిలీ ఖతం


2

2

## ఎవరీ కల్నల్ సోఫియా, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్



# ఏపీ ప్రభుత్వానికి అద్భుతమైన ఆలోచన



- ఇక్కడి ఆర్టీజీఎస్ లాంటి వ్యవస్థలు ప్రభుత్వాలకు అవసరం
- స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిస్సాఫీ
- ఆర్టీజీఎస్ ను సందర్శించిన స్విట్జర్లాండ్ ప్రతినిధులు
- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఈ సంస్థ ఒక వారధిలా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఫలాలు ప్రజలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చేరేలా ఈ సంస్థ పనిచేస్తోంది

**అమరావతి**


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ వ్యవస్థ అద్భుతమని, ప్రభుత్వాలకు ఇలాంటి వ్యవస్థల అవసరం ఎంతో ఉందని స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిస్సాఫీ అన్నారు. బుధవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ ను స్విట్జర్లాండ్ రాయబారి, ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆర్టీజీస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రఖర్ జైన్ స్వాగతం పలికి వారికి ఆర్టీజీఎస్ పనితీరు గురించి వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలనే సదాశయంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినూత్న ఆలోచనల నుంచి ఆర్టీజీఎస్ వ్యవస్థ రూపుదిద్దుకొందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఈ సంస్థ ఒక వారధిలా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఫలాలు ప్రజలకు - మిగతా 3లో



## అక్కడ జరిగిందేమిటి? మీరు చేస్తున్నదేమిటి?

- ఆపరేషన్ సిందూర్‌పై తప్పుడు కథనాలు రాస్తారా?
- చైనా మీడియాపై భారత్ ఆగ్రహం
- మీరు వార్తలు ప్రచురించేటప్పుడు వాస్తవాలు పరిశీలించుకోండి
- ఒకసారి క్రాస్ చెక్ చేసుకోండి
- పాత ఫోటోలతో మభ్యపెట్టి వార్తలను ప్రచురిస్తారా?
- చైనాలోని భారత్ ఎంబాసీ ధ్వజం

## మోదీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటాం




- చివరి ఉగ్రవాదిని అంతం చేసేవరకు మోదీ పోరాటం ఆగదు
- పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ చేసిన దాడులు గర్వించదగ్గ విషయం
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

# కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు

- 26 మంది మావోయిస్టులు మృతి
- అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి
- రెండు ఏకే-47లను బలగాలు స్వాధీనం

**చర్ల**

తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. ఘటనా స్థలంలో కాల్పులు - మిగతా 3లో






## అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టాం

- ఉగ్రదాడిలో టూరిస్టులను అత్యంత కిరాతకంగా చంపిన వారికి గట్టి సమాధానమిచ్చాం
- సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత జాగరూకతతో ఈ దాడులు నిర్వహించాం
- మన సైనికులు అద్భుత పరాక్రమం ప్రదర్శించారు
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

# చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేను

- జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయిలో ఉన్న బూత్ కమిటీల వరకూ ప్రత్యేక దృష్టిపెట్టాలి
- రీజినల్ కో-ఆర్డినేటర్లకు పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు సహాయకారులుగా ఉంటారు
- రీజినల్ కో-ఆర్డినేటర్లతో అనుసంధానమై, వారికి కాళ్లు, చేతులుగా పార్లమెంటు పరిశీలకులు పనిచేస్తారు
- నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌ఛార్జిలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడగలగాలి
- తప్పకుండా మనం అధికారంలోకి వస్తాం.. అందులో ఎలాంటి సందేహం లేదు




**తాడేపల్లి**

మీరంతా సమర్థులని భావించి ఈ బాధ్యతలు అప్పగించడం జరిగిందని.. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులకు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయిలో ఉన్న బూత్ కమిటీల వరకూ ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. రీజినల్ కో-ఆర్డినేటర్లకు పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు సహాయకారులుగా ఉంటారు. రీజినల్ కో-ఆర్డినేటర్లతో అనుసంధానమై, వారికి కాళ్లు, - మిగతా 3లో

# సైనిక బలగాలకు కాంగ్రెస్ పూర్తి మద్దతు

- సైనిక బలగాలకు తాము అండగా ఉంటా
- ఈ మేరకు సీడబ్ల్యూసీలో నిర్ణయం
- భారత సాయుధ దళాలను చూసి తాము గర్విస్తున్నాం
- దేశ రక్షణ, ఐక్యత, స్వేచ్ఛను కాపాడటానికి తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నాం



# ఆపరేషన్ సిందూర్



పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారంతో రగిలిపోయిన భారత్?- 25 నిమిషాల్లో 24 క్షిపణులతో దాడులు చేసి ఉగ్రవాద మూకల ఆటకట్టించింది. చెప్పినట్టే చేసి టెర్రరిస్టులకే టెర్రర్ అంటే ఏంటో చూపించింది. బుధవారం తెల్లవారుజామున 1:05 గంటల నుంచి 1:30 గంటల వరకు 25 నిమిషాల పాటు ఆపరేషన్ జరగ్గా, 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడానికి 24 క్షిపణులను భారత్ ప్రయోగించింది. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన సంయుక్తంగా, పరస్పర సమన్వయంతో నిర్వహించాయి.

**నిఘా డ్రోన్‌ల పర్యవేక్షణలో దాడి**

ఉగ్ర స్థావరాలపై ఎటాక్ కోసం భూమి నుంచి, గాలి నుంచి ప్రయోగించే క్షిపణులతో పాటు లేజర్ నిర్దేశిత క్షిపణులు, ఉపగ్రహ గైడెడ్ గ్లైడ్ బాంబులను భారత్ ఉపయోగించింది. నిఘా డ్రోన్‌ల రియల్ టైమ్ పర్యవేక్షణలో అతి తక్కువ ప్రాణనష్టంతో ఉగ్రవాద స్థావరాలను కచ్చితత్వంతో భారత్ ధ్వంసం చేసింది. 'ఆపరేషన్ సిందూర్'లో పదుల సంఖ్యలో పాక్ ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. అయితే ఈ మరణాల వివరాలను తగ్గించి చూపేందుకు పాకిస్తాన్ యత్నిస్తున్నట్లు సమాచారం.

**దాడికి ముందు పెద్ద కసరత్తు!**

ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి ముందు భారత త్రివిధ దళాలు పెద్ద కసరత్తే చేశాయి. తొలుత పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీఓకే)లోని ప్రధాన ఉగ్రవాద స్థావరాల లొకేషన్లను అత్యంత కచ్చితత్వంతో గుర్తించాయి. ఇందుకోసం భారత నిఘా వర్గాలు అందించిన సమాచారాన్ని వాడుకున్నాయి. పాక్, పీఓకేలోని ముజఫరాబాద్, కోట్లి, బహవల్‌పూర్, రావల్ కోట్, చాక్స్వరి, భీంబేర్, నీలం వ్యాలీ, జీలం, చాక్వల్‌లలో ఉన్న నిర్దిష్ట ఉగ్రవాద స్థావరాలను టార్గెట్‌లుగా భారత్ ఎంచుకుంది. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలు లష్కరే తైబా, జైషే మహ్మద్ గతంలో భారత్‌లో ఎన్నో ఉగ్రదాడులకు పాల్పడ్డాయి. ఈ రెండు ఉగ్ర సంస్థలకు నిలయాలుగా, స్థావరాలుగా మారిన 9 నిర్దిష్ట ప్రాంతాలనే తమ లక్ష్యంగా భారత త్రివిధ దళాలు ఎంచుకున్నాయి. వీటిలో నాలుగు ఉగ్ర స్థావరాలు పాకిస్తాన్‌లో ఉండగా, మిగతా ఐదు ఉగ్ర స్థావరాలు పీఓకేలో ఉన్నాయి.

**బహవల్‌పూర్, ముజఫరాబాద్, భీంబేర్‌లో!**

బహవల్‌పూర్ అనేది జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు అడ్డాగా మారింది. ఉగ్రవాదులను జమ్మూకశ్మీరులోకి చొరబాటుకు పంపేందుకు ముజఫరాబాద్, భీంబేర్‌లను పాక్ ఉగ్రవాద సంస్థలు ఎంట్రీ పాయింట్లుగా వాడుకుంటున్నాయి. దీనిపై భారత భద్రతా సంస్థలకు పక్కా సమాచారం అందింది. అందుకే వాటిని ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా టార్గెట్ చేశారు. మొత్తం మీద 9 ఉగ్రవాద స్థావరాల్లోని డ్రోన్లతో భారత్‌పై నిఘా పెట్టే కమాండ్ కంట్రోల్ సెంటర్లు, ట్రైనింగ్ క్యాంపులు, ఆయుధ డిపోలు, ఇతరత్రా మౌలిక సదుపాయాలను భారత సేనలు విజయవంతంగా ధ్వంసం చేశాయి. ఇవన్నీ రాత్రికి రాత్రి పాక్ ఆక్రమిత కశ్మీరులో ఏర్పాటు కాలేదు. గత 30 ఏళ్లుగా పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం నుంచి అందుతున్న ఆర్థికసాయంతోనే ఉగ్రవాదులు ఈ మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేసుకున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.

## అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టాం




**న్యూఢిల్లీ:** ఆపరేషన్ సింధూర్ తో పహల్గాం ఉగ్రదాడిలో టూరిస్టులను అత్యంత కిరాతకంగా చంపిన వారికి గట్టి సమాధానమిచ్చామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మన అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టామని, సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత జాగరూకతతో ఈ దాడులు నిర్వహించామని చెప్పారు. మన సైనికులు అద్భుత పరాక్రమం ప్రదర్శించారని కొనియాడారు. 6 రాష్ట్రలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ చేపట్టిన 50 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రాజ్‌నాథ్ సింగ్ బుధవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను టార్గెట్ చేసుకుని సాయుధ బలగాలు విజయవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించారని అభినందించారు. పహల్గాంలో ఉగ్రవాదులు 25 మంది టూరిస్టులు, ఒక కశ్మీర్ పోనీ రైడ్ ఆపరేటర్‌ను అత్యంత పాశవికంగా హత్య చేశారని, ఇందుకు ప్రతిగా ఉగ్రవాదులపై దాడి చేసే హక్కును భారత్ సమర్ధవంతంగా ఉపయోగించుకుందని రాజ్‌నాథ్ చెప్పారు. భారత సాయుధ బలగాలు చరిత్రను తిరగరాశాయని అన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. రామాయణంలో రావణాసురుడు సీతమ్మ వారిని నిర్బంధించిన అశోకవనాన్ని హనుమంతుడు నాశనం చేశాడని, అదే స్ఫూర్తితో భారత్ ప్రతిదాడి జరిపిందని ఉదహరించారు. "మన అమాయక పౌరులను ఎవరైతే చంపారో వారిని మాత్రమే మనం చంపాం" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మన బలగాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఉగ్రవాద శిక్షణా శిబిరాలను ధ్వంసం చేశాయి. గట్టి బదులిచ్చాయి. కచ్చితమైన ప్రణాళికతో ఇదంతా చేశాం. ఉగ్రవాదుల నైతికస్థైర్యాన్ని దెబ్బతీశాం. ఈ దాడులను ఉగ్రవాద శిబిరాలు, మౌలిక వసులకే పరిమితం చేశాం. మన సాయుధ బలగాల ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తున్నాను" అని రాజ్‌నాథ్ అన్నారు.

## అక్కడ జరిగిందేమిటి? మీరు చేస్తున్నదేమిటి?



**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రదాడిలో అమాయకుల్ని ప్రాణాలు పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదుల వేరివేత లక్ష్యంగా భారత్ ' ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. పాక్ లో ఉన్న తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడి చేసిన భారత్.. 90 మంది వరకూ టెర్రర్ మూకలను మట్టుబెట్టింది. అయితే భారత్ విజయవంతంగా పూర్తి చేసిన ఆపరేషన్ సిందూర్ పై చైనా మీడియా విషం కక్కింది. చైనాలోని గ్లోబల్ టైమ్స్' అనే మీడియా సంస్థ ఆపరేషన్ సిందూర్ భారత్ విమానాలను పాక్ కూల్చిందంటూ తప్పుడు ప్రచారాన్ని మొదలుపెట్టింది. కొన్ని పాత ఫోటోలను జత చేసి వాటిని ప్రస్తుత ఆపరేషన్ సిందూర్ కు ఆపాదించింది. దీనిపై చైనాలోని భారత్ ఎంబాసీ కార్యాలయం తీవ్రంగా స్పందించింది. అక్కడ జరిగింది ఏమిటి.. మీరు చేస్తున్నదేమిటి అంటూ మండిపడింది ఒక విషయాన్ని వార్త రూపంలో ప్రచురించేటప్పుడు వాస్తవాలను తెలుసుకోవాలని, దానికి మూలాలను అన్వేషించి వార్తలు వేయాలని గ్లోబల్ టైమ్స్ కు చురకలంటించింది. అక్కడా ఆపరేషన్ సిందూర్ తో ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ దాడులు చేసి విజయవంతంగా దాన్ని పూర్తి చేస్తే మీరు దాన్ని వక్రీకరించడం తగదంటూ హితవు పలికింది. కాగా, ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ బుధవారం అర్ధరాత్రి చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది పాకిస్థాన్‌కు భయం పుట్టిస్తోంది. ప్రధానంగా జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వాటిని కూల్చివేసింది. విజయవంతంగా జరిపిన ఈ 'ఆపరేషన్ సిందూర్'లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు చావు దెబ్బ తగిలినట్లు సమాచారం. జైషే ముఠాకు చెందిన ఓ స్థావరంపై జరిగిన దాడిలో 14 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇందులో 10 మంది మసూద్ కుటుంబసభ్యులు హతమయ్యారు.

# ఎవరీ కల్నల్ సోఫియా, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్


**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయం వంతంగా ముగిబీసింది. పాకిస్తాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో మంగళవారం అర్ధ రాత్రి భారత భద్రతా దళాలు ఆర్మీ,నేవీలు సంయుక్తంగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టాయి. ఆపరేషన్‌లో భాగంగా లక్షిత దాడుల్ని అరగంటలోపు నేలమట్టం చేసింది. 9స్థావరాల్లో ఉన్న 80 మందికి పైగా ఉగ్రవాదుల్ని మట్టిలో కలిపేశాయి. అనంతరం ఆపరేషన్ సిందూర్‌పై మీడియా సమావేశం జరిగింది. ఈ ఆపరేషన్‌కు సారథ్యం వహించిన భారత సశస్త్ర దళాల్లో ఇద్దరు సీనియర్ మహిళా అధికారులు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, కర్నల్ సోఫియా ఖురేషీ,విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రిలు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు నాయకత్వం వహించిన సశస్త్ర దళాలకు నాయకత్వం వహించిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, కర్నల్ సోఫియా ఖురేషీలు ఉగ్రమూకల్ని ఎలా మట్టుబెట్టామన్నది వెల్లడించారు. దాడి దృశ్యాలకు సంబంధించిన వీడియోల్ని బహిర్గతం చేశారు. దీంతో ప్రపంచ మొత్తం ఈ ఇద్దరి మహిళా అధికారులు గురించి చర్చ మొదలైంది.

**కల్నల్ సోఫియా ఖురేషీ**

ఇండియన్ ఆర్మీలోని త్రివిధ దళాలలైన ఆర్మీలోని సిగ్నల్‌కోర్‌కి చెందిన కల్నల్ సోఫియా ఖురేషీ. అనేక సాహసోపేతమైన విజయాలతో సైనిక చరిత్రలో తన స్థానాన్ని సుస్థిర పరుచున్నారు. ఆర్మీ కల్నల్ హోదాలో ఆపరేషన్ సిందూర్‌కు ముందుండి నాయకత్వం వహించారు.

**ఫోర్స్ 18కు నాయకత్వం**

2016 మార్చిలో అప్పటి లెఫ్టినెంట్ కర్నల్ ఖురేషీ భారత్ ఆతిథ్యమిచ్చిన ఫోర్స్ 18 అనే బహుళజాతీయ సైనిక విన్యాసంలో భారత సైన్యం తరపున ఒక దళానికి నాయకత్వం వహించిన తొలి మహిళా అధికారిగా చరిత్ర సృష్టించారు. ఈ విన్యాసం మార్చి 2 నుండి 8 వరకు పుణేలో జరిగింది. ఇందులో ఆసియన్ దేశాలతో పాటు జపాన్, చైనా, రష్యా, యుఎస్, దక్షిణ కొరియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి 18 దేశాలు పాల్గొన్నాయి. ఈ విన్యాసంలో పాల్గొన్న దళాల్లో, లెఫ్టినెంట్ కర్నల్ ఖురేషీ మాత్రమే మహిళా కమాండర్‌గా ఉండడం ఆమె నాయకత్వ నైపుణ్యానికి నిదర్శనం.




**పీస్ కీపింగ్ ఆపరేషన్స్‌లోనూ**

ఆమె నేతృత్వంలోని 40-సభ్యుల భారత దళం శాంతి భద్రతలను కాపాడేందుకు, సంఘర్షణ లేదా సంఘర్షణానంతర ప్రాంతాలకు సైనిక సిబ్బందిని మోహరించి ఉద్రిక్తత పరిస్థితులను తగ్గించే విభాగమే ఈ పీస్ కీపింగ్ ఆపరేషన్స్ ఈ పీకేవో ఆపరేషన్స్‌లో కీలక పాత్ర పోషించారు. హ్యూమానిటేరియన్ మైన్ యాక్షన్ వంటి కీలక శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంది. దేశవ్యాప్తంగా అనుభవజ్ఞులైన పీస్ కీపింగ్ శిక్షణాదారులలోంచి ఆమెను ఎంపిక చేశారు.

**యుఎన్ శాంతి పరిరక్షణలో విశిష్ట అనుభవం**

2006లో, యుఎన్ శాంతి పరిరక్షణ మిషన్ (కాంగో) లో మిలిటరీ అబ్జర్వర్‌గా పనిచేశారు. 2010 నుంచి ఆమె పీకేవోలో కొనసాగుతూ వచ్చారు. అందులో ఆమె విశేష సేవలు అందిస్తున్నారు.

సైనిక సేవ ఆమెకు వారసత్వంగా ఆమె తాత సైన్యంలో సేవలందించగా, ఆమె భర్త కూడా మెకనైజ్డ్ ఇన్ఫెంట్రీకి చెందిన అధికారి. ఈ విధంగా ఆమె కుటుంబం సైనిక సేవలతో ముడిపడింది

**వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్**

వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, భారత వైమానిక దళానికి చెందిన పైలట్. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడులు ఈమె నేతృత్వంలోనే జరిగాయి. వ్యోమికా సింగ్ విషయానికొస్తే.. వ్యోమిక అంటే ఆకాశపు కుమార్తె అని అర్ధం. ఆ పేరులో ఆమె చిన్ననాటి కల ప్రతిబింబిస్తుంది. చిన్నప్పటి నుంచే ఆమెకు పైలట్ కావాలనే సంకల్పం ఉండేది. స్కూల్ రోజుల్లోనే ఆమె ఎన్‌సీసీలో చేరి, తరువాత ఇంజినీరింగ్ పూర్తి చేశారు. కుటుంబంలో మొదటిసారిగా సైన్యంలో చేరిన వ్యక్తిగా ఆమె పేరు గడించారు. 2019 డిసెంబర్ 18న, ఆమెకు శాశ్వత కమిషన్ లభించి, హెలికాప్టర్ పైలట్‌గా ఐఏఎఫ్‌లో ఆమె ప్రయాణం అధికారికంగా ప్రారంభమైంది.

**ఆపరేషన్ సిందూర్లో ఈ ఇద్దరే కీలకం!**

చల్లని గాలుల మధ్య నుండి మసక చీకట్ల వరకూ అన్నీ సాహసాలే

వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇప్పటివరకు 2,500కు పైగా ఫ్లయింగ్ గంటలు పూర్తి చేశారు. చేతక్, చీటాహ్ వంటి హెలికాప్టర్లను నడిపుతూ, జమ్మూ కాశ్మీర్ లోని ఎత్తయిన ప్రాంతాలు నుండి, ఈశాన్య భారతదేశంలోని గిరిజన ప్రాంతాల వరకూ సేవలందించారు. 2020లో అరుణాచల్ ప్రదేశ్‌లో, ప్రాణాపాయ పరిస్థితుల్లో సామా న్యులను రక్షించేందుకు ఆమె ఒక కీలకమైన రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. 2021లో ఆమె మౌంట్ మనిరంగ్ (21,650 అడుగుల ఎత్తు) పైకి ప్రయాణించిన త్రివిధ దళాల మహిళా ఎక్సపిడిషన్‌లో పాల్గొన్నారు.

**ఆపరేషన్ సిందూర్ తర్వాత**

పహల్గాంలో 26 మంది సాధారణ పౌరుల హత్యకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో, దేశానికి సమాచారం ఇవ్వడమే కాక, భారత సైన్యం ఇప్పుడు ఎవరిచేత ప్రాతినిధ్యం వహించబడుతోంది అన్న దానిలో స్పష్టమైన మార్పును వింగ్ కమాండర్ సింగ్ చూపించారు

## సైనిక బలగాలకు కాంగ్రెస్ పూర్తి మద్దతు



**దిల్లీ:** పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై భారత్ సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఈ విషయంలో తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ ప్రకటించింది. భారత్ చేపట్టిన దాడుల నేపథ్యంలో ఆ పార్టీ వర్కింగ్ కమిటీ బుధవారం అత్యవసరంగా సమావేశం అయ్యింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్ తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సాహసోపేత నిర్ణయం తీసుకున్న భారత సాయుధ దళాలను చూసి తాము గర్విస్తున్నామని మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడడానికి అన్ని స్థాయిల్లో ఐక్యంగా ఉండాలన్నారు. దేశ రక్షణ, ఐక్యత, స్వేచ్ఛను కాపాడటానికి తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నామని వెల్లడించారు. సాయుధ దళాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని రాహుల్ గాంధీ కూడా ప్రకటించారు.

**రేపు అఖిలపక్ష సమావేశం**

ఉగ్ర స్థావరాలపై దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గురువారం ఉదయం 11 గంటలకు అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో ఈ సమావేశం జరగనుంది. పహల్గాం దాడి అనంతరం ఏప్రిల్ 24న కూడా కేంద్రం అఖిలపక్ష భేటీ నిర్వహించింది.

## మసూద్ అజర్ ఫ్యామిలీ ఖతం



**ఢిల్లీ:** ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ బుధవారం అర్ధరాత్రి చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది పాకిస్థాన్‌కు భయం పుట్టిస్తోంది. ప్రధానంగా జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వాటిని కూల్చివేసింది. విజయవంతంగా జరిపిన ఈ 'ఆపరేషన్ సిందూర్'లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు చావు దెబ్బ తగిలినట్లు సమాచారం. జైషే ముఠాకు చెందిన ఓ స్థావరంపై జరిగిన దాడిలో 14 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇందులో 10 మంది మసూద్ కుటుంబసభ్యులేనని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. బవహల్పూర్ లోని జైష్-ఎ-మహమ్మద్, మురిద్కే కేంద్రంగా ఉన్న లష్కర్-ఎ-తొయిబా క్యాంపులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జరిపిన దాడుల్లో దాదాపు 90 మంది ఉగ్రవాదులు హతమైనట్లుగా సమాచారం. ముఖ్యంగా బవహల్పూర్‌లోని జైష్-ఎ-మహమ్మద్ శిబిరాలు, సుభాన్ అల్లా కాంప్లెక్స్‌పై జరిపిన ఎయిర్ స్ట్రైక్‌లో ఆ సంస్థ చీఫ్ మసూద్ అజార్ కుటుంబ సభ్యులు 10 మందితో పాటు అనుచరులు మరణించినట్లు తెలుస్తోంది. మసూద్ అజార్ అక్క, బావ, మేనల్లుడు, అతడి భార్య కూడా ఉన్నట్లు సమాచారం.

## పాక్ ప్రతిదాడి చేయెచ్చు, అప్రమత్తంగా ఉండాలి

## రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ థిల్లాన్

**న్యూఢిల్లీ:** పాక్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ లక్షిత దాడులు నేపథ్యంలో పాక్ ప్రతిదాడులు చేసే అవకాశాలను కొట్టివేయలేమని ఇండియన్ ఆర్మీ మాజీ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ థిల్లాన్ ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలిపారు. పహల్గాం దాడికి ప్రతిగానే సైన్యం "ఆపరేషన్ సింధూర్" నిర్వహించిందని, అయితే మనం అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందని చెప్పారు. "హహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. కానీ, మనం చాలా అప్రమత్తంగా ఉండాలి. పాక్ ప్రతిదాడికి ప్రయత్నించొచ్చు. అయితే వారి దాడి భారత పౌరులకు ప్రమాదకరం కాకపోవచ్చు, అయితే వాళ్లు (పాక్) మాత్రం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని థిల్లాన్ విశ్లేషించారు. పహల్గాం దాడికి బాధ్యులైన వారిపై మాత్రమే సైన్యం దాడులు జరిగాయని, పౌర, సైనిక స్థావరాలపై దాడులు చేయలేదని చెప్పారు. కేవలం టెర్రరిస్టు శిబిరాలను ధ్వంసం చేయడంపైనే సైన్యం దృష్టిపెట్టిందన్నారు.

**గతానికి ఇప్పటికీ తేడా ఉంది..**

గత సైనిక ఆపరేషన్లతో పోల్చుకుంటే ఈసారి సైనికి ఆపరేషన్ భిన్నమైనదని, ఈసారి సైన్యం నిర్దేశించిన దాడుల లక్ష్యాలు మరింత విస్తారంగా, లోతుగా ఉన్నాయని అన్నారు. త్రివిధ దళాలు పూర్తి సమన్వయంతో అత్యంత సమర్ధవంతంగా, ప్రభావవంతంగా దాడులు నిర్వహించాయని ప్రశంసించారు.

# చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేను



-మొదటిపేజీ తరువాయి

చేతులుగా పార్లమెంటు పరిశీలకులు పనిచేస్తారు. నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌ఛార్జిలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడగలగాలి. మీరు పరిశీలకుడిగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ఎంతమందిని ఎమ్మెల్యేలుగా గెలిపిస్తారనేది మీకు పరీక్ష. మీ పనితీరు ఆధారంగా మీకు మంచి మంచి పదవులు వస్తాయి.. తప్పకుండా మనం అధికారంలోకి వస్తాం, అందులో ఎలాంటి సందేహం లేదు.. ఈ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం లేదు" అని వైఎస్ జగన్ చెప్పారు.

"ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా పారదర్శకంగా అమలు చేసిన మనకే ఇలాంటి పరిస్థితి వచ్చింది. ఇక అబద్ధాలు చెప్పి, మోసాలు చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుంది?. 2014లో కూడా చంద్రబాబు తానిచ్చిన హామీలను అమలు చేయలేదు. మనం పాదయాత్ర చేసి, ప్రజలకు భరోసా ఇచ్చాం. 2019 ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకత కొట్టిచ్చినట్టు ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. ప్రజావ్యతిరేకతను చీల్చడానికి చంద్రబాబు తన రాజకీయ భాగస్వామిని వేరేగా పోటీచేయించారు. అయినా చంద్రబాబు తన ఓటమిని అడ్డుకోలేకపోయారు. చంద్రబాబు రాకముందు.. మన పథకాల ద్వారా పేదల నోట్లోకి నాలుగు వేళ్లూ వెళ్లేవి. ఇప్పుడు చంద్రబాబు ప్రజలు తింటున్న కంచాన్ని లాగేశాడు" అని వైఎస్ జగన్ మండిపడ్డారు.

"అంతేకాదు తానిచ్చిన హామీలను కూడా చంద్రబాబు అమలు చేయలేదు. రెండు రకాలుగా చంద్రబాబు ప్రజలను మోసం చేశాడు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలు పూర్తిగా నీరు గారిపోయాయి. ఉచిత పంటల బీమా గాలికి ఎగిరిపోయింది. రైతులకు పెట్టుబడి సహాయంగా ఉన్న రైతు భరోసా ఎగిరిపోయింది. అవినీతి విచ్చలవిడిగా జరుగుతోంది. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ, అదే రూపాయికి వేల కోట్ల విలువైన భూములు కట్టబెడుతున్నారు. లూలుకు రూ.1500 కోట్ల భూములు కట్టబెట్టారు. మరొకరికి రూ.3వేల కోట్ల భూములు కట్టబెట్టారు.

..రైతులకు ఉచితంగా విద్యుత్ అందించడానికి సెకీతో మనం రూ.2.49లకే విద్యుత్ కొనుగోలు చేశాం. కాని ఇవాళ వీళ్లు రూ.4.60లకు కొనుగోలు చేశారు. సెక్షన్ 108 ప్రకారం ఏపీఆర్సీపీమీద ఒత్తిడి తెచ్చి మరీ అమలు చేయించుకున్నారు. అవినీతి మన కంటికి కనిపిస్తోంది. మట్టి మాఫియా, ఇసుక మాఫియా, పేకాట క్లబ్బులు, బెల్టుషాపులు, ఎమ్మార్పీ ధర కన్నా లిక్కర్ ఎక్కువకు అమ్ముకుంటున్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేకు మట్టజెప్పనిదే ఏమీ కావడంలేదు. ఇవన్నీ కంటికి కనిపిస్తున్నాయి. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారు. ఒక్కసారి ఓటు వేశాక, ఐదేళ్లపాటు ప్రజలు వేచి చూడాలి. అందుకే ఇప్పుడేమీ చేయలేక ప్రజలు అన్నింటినీ చూస్తున్నారు

..సమయం వచ్చినప్పుడు కచ్చితంగా ప్రజలు కచ్చితంగా తగిన తీర్పు ఇస్తారు. ఇప్పుడు కలియుగం పాలిటిక్స్ నడుస్తున్నాయి. కేసులకు భయపడితే రాజకీయాలు చేయలేం. చంద్రబాబు రాజకీయాలను ఒక దారుణమైన స్థాయికి తీసుకెళ్లారు. రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితులు ఉండకూడదని మన ప్రభుత్వంలో చాలా కష్టపడ్డాం. మన పరిపాలనలో చాలామంది నాయకులను కట్టడి చేశాం.

తాడిపత్రిలో మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీ స్వల్ప ఆధిక్యత వచ్చింది. వైఎస్సార్‌సీపీకి 16, టీడీపికి 18 వచ్చాయి. కాని అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మన పార్టీ వైపునకు ఫలితాన్ని తిప్పుదామని యత్నించారు. ఆ రోజు మన పార్టీ ఎమ్మెల్యే అయిన పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేశాం. ఇప్పుడు ఏడాది కాలంగా పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయడంలేదు. కార్యకర్తల ఆస్తులను విధ్వంసం చేస్తున్నారు. ఇప్పుడు పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం, కక్ష రాజకీయాలతో రాజకీయ వ్యవస్థ దారుణంగా తయారైంది" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

"ఈ ప్రభుత్వం చేసిన దుర్మార్గాలు చూసిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. కార్యకర్తలకు కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుంది. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరినీ గొప్ప స్థానంలో కూర్చోబెడతాను. ఈ సారి కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత. చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేను. ప్రజలకు హామీలు ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తాను. కార్యకర్తల్లో ఇప్పటికే మంచి చైతన్యం వచ్చింది. కేడర్ ధైర్యంగా నిలబడింది. రాష్ట్రవ్యాప్తంగా నేను ఎక్కడకు వెళ్లినా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివస్తున్నారు. రాష్ట్రంలో అరాచక పాలన పట్ల వివిధ రూపాల్లో వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు పరిపాలన పట్ల తీవ్రమైన ఆగ్రహం ఉంది. రాజకీయాలతో సంబంధం లేనివారినికూడా కక్షలకు గురిచేస్తున్నారు. వచ్చే ఏడాది ప్లీనరీని నిర్వహిద్దాం. బ్రహ్మాండంగా ప్లీనరీని నిర్వహిద్దాం. ..బూత్ కమిటీలు పూర్తయ్యే సరికి పార్టీ నిర్మాణంలో దాదాపుగా 18 లక్షలమంది ఉంటారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధరలేదు, కనీస మద్దతు ధర అందడంలేదు. వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో ప్రతి గ్రామ సచివాలయంలో కనీస మద్దతు ధరలతో జాబితాను పెట్టేవాళ్లం. ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధర వస్తే అప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకునేది. పొగాకు విషయంలో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జోక్యంచేసుకునేది. ప్రైవేటు కంపెనీలతో పోటీపడి వేలంలో పాల్గొన్నాం. రైతులను ఆదుకున్నాం. అలాగే ఆయిల్‌పాం రైతులను ఆదుకున్నాం. తెలంగాణతో సమాన స్థాయిలో ధర వచ్చేలా చూశాం. ఎలాంటి విపత్తులు వచ్చినా రైతులను ముందుగా ఆదుకునేవాళ్లం. ..ధాన్యానికి ఎంఎస్‌పీ ఇవ్వడమే కాదు, ఎంఎస్‌పీకి అదనంగా జీఎల్టీ కూడా ఇచ్చాం. వ్యవసాయరంగంపై ఇంత ఫోకస్ పెట్టిన ప్రభుత్వం మనదైతే, ఏ ఫోకస్ పెట్టని ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. పంటలకు నష్టం వస్తే సీజన్ మగిసేలోగా వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేవాళ్లం. మళ్లీ సీజన్‌లోగా పరిహారం ఇచ్చేవాళ్లం. క్రమంగా ప్పతకుండా ఇన్సూరెన్స్ ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ఏమీ లేవు. క్రమం తప్పకుండా ఐదేళ్లపాటు మనం రైతులకు పెట్టుబడి సహాయం అందించేవాళ్లం" అని వైఎస్ జగన్ గుర్తు చేశారు.

# అమరావతిలో జోరుగా రియల్ వ్యాపారం



**విజయవాడ :** అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథిగా హాజరై పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవం చేశారు మరో మూడేళ్లలో ప్రజా రాజధాని అందుబాటులోకి వస్తుందని ప్రకటించారు. ఏపీ సీఎం చంద్రబాబు పై తనకు నమ్మకం ఉందని.. ఆయన చేసి తీరుతారని ప్రధాని ప్రకటించారు. దీంతో అమరావతికి కొత్త ఊపిరి వచ్చినట్లు అయింది. అయితే అమరావతి రాజధాని కాకుండా.. సమాన స్థాయిలో అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఊపందుకోవడం విశేషం. అమరావతి ప్రాంతంలో ఎక్కడ చూసినా రియల్ ఎస్టేట్ హడావిడి కనిపిస్తోంది. మూతపడిన ఆఫీసులు తెరుచుకుంటున్నాయి. లేఅవుట్ సరిహద్దు రాళ్లకు రంగులు పడుతున్నాయి. లేఅవుట్లలో కొత్తగా ఫ్లెక్సీలు, జెండాలు కడుతున్నారు. వాటి విక్రయాల కోసం మార్కెటింగ్ సిబ్బందిని నియమిస్తున్నారు. 2014లో రాష్ట్ర విభజన జరిగింది. తెలంగాణ విభజిత రాష్ట్రం కాగా.. ఏపీ నవ్యాంధ్రప్రదేశ్ గా మారింది. అటువంటి సమయంలో అందరి అభిప్రాయంతో అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు చంద్రబాబు. దాదాపు 33 వేల ఎకరాల భూమిని రైతుల స్వచ్ఛందంగా అమరావతి రాజధాని కోసం ఇచ్చారు. అది మొదలు తెలంగాణలో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమరావతి వైపు చూడడం ప్రారంభించారు. ఆంధ్రుల రాజధాని అమరావతి ప్రపంచ దేశాల్లో భావి నగరంగా మారుతుందని ఆశించారు. అందుకే పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసి ప్లాట్లను విక్రయించే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ భూముల ధరలు ఆకాశానికి అంటాయి. కానీ 2019లో అధికారం చేతులు మారడం.. అమరావతి రాజధాని నిర్వీర్యం కావడం.. మూడు రాజధానులు తెరపైకి రావడం చకచకా జరిగిపోయాయి. అప్పటివరకు జెట్ స్పీడ్ తో వెళ్లిన రియల్ ఎస్టేట్ వ్యాపారం అమాంతం పడిపోయింది. గత ఐదేళ్లలో ఆ రంగం పై ఆధారపడిన వ్యాపారులు, ఉద్యోగులు వీధిన పడిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ వ్యాపారం పెట్టుబడులు పెట్టిన వారంతా లబోదిబోమన్నారు. కానీ ఎట్టకేలకు టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో అమరావతికి కొత్త కళ వచ్చింది. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి.ప్రస్తుతం అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంటోంది. అమరావతిలో పొలాలను ఎక్కడా కొనే పరిస్థితిలో లేదు. కోర్ క్యాపిటల్ పరిధిలో పొలాలు కొనగలిగే రేంజ్ లో కూడా ధరలు లేవు. అమరావతి చుట్టుపక్కల, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఎక్కడ కూడా పొలాలు కొనుగోలు చేయడానికి ధర అందుబాటులో లేదు. ప్రస్తుతం ఒక అమరావతి ప్రాంతంలోనే కాకుండా.. గుంటూరు, విజయవాడ, మంగళగిరి, తెనాలి, బాపట్ల వరకు ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో సామాన్యులు అక్కడ కొనుగోలు చేసే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.గత అనుభవాల దృష్ట్యా అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పై పెట్టుబడి పెట్టే వారు మాత్రం చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. గతం మాదిరిగా దూకుడుగా అడుగు వేసే పరిస్థితి లేదు. పెట్టుబడి పెట్టాలనుకునే వాళ్లు కొద్ది రోజులు ఆగుదాం అని ఆలోచిస్తున్నారు. మరికొందరు అయితే కేంద్ర ప్రభుత్వం సహాయం, రాష్ట్ర ప్రభుత్వం దూకుడు, పార్లమెంట్లో ప్రత్యేక చట్టం వంటి వాటిని దృష్టిలో పెట్టుకొని భూముల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఒకటి మాత్రం నిజం. గతంతో పోల్చుకుంటే కొనుగోలు సంఖ్య మాత్రం పెరగడం లేదు. ఈ విషయాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సైతం ధ్రువీకరిస్తోంది. మొత్తానికైతే అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. కానీ గత మాదిరిగా దూకుడుగా వెళ్లడం లేదు.

## జూన్ 1 నుంచి విమాన సేవలు

**విశాఖపట్టణం :** ఏపీకి రాజధానిగా అమరావతి ఉంది. అమరావతి పునర్నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మరో మూడేళ్లలో ప్రజా రాజధాని అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. మరోవైపు విశాఖ నగరాన్ని ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. అందులో భాగంగా దిగ్గజ పారిశ్రామిక సంస్థలు విశాఖలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ సంస్థలు పెద్ద ఎత్తున కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయి. ఈ తరుణంలో విజయవాడ నుంచి విశాఖకు రాకపోకలు ఎక్కువగా సాగుతున్నాయి. రోడ్డు మార్గంలో వెళ్లాలంటే సమయం పడుతుంది. రైలు మార్గంలో కూడా జాప్యం జరుగుతోంది. మరోవైపు విజయవాడ నుంచి విశాఖకు నేరుగా విమాన సర్వీసులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత కొద్దిరోజులుగా దీనిపై విమర్శలు వస్తుండడంతో కేంద్ర పౌర విమానయాన శాఖ దృష్టి పెట్టింది. రెండు నగరాలను కలుపుతూ విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కీలక ప్రకటన చేశారు.విజయవాడ నుంచి విశాఖకు వెళ్లాలంటే.. చెన్నై నుంచి వచ్చే ఒకే విమానం అందుబాటులో ఉంది. అందుకే దానికి విపరీతమైన రద్దీ ఉంటుంది. దీంతో చాలామంది హైదరాబాద్ కు వెళ్లి.. అక్కడి నుంచి విశాఖకు చేరుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు విమాన సర్వీసులపై ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సైతం దీనిపై ఆవేదన వ్యక్తం చేశారు. పౌర విమానయాన సర్వీసులపై విమర్శలు రావడంతో సంబంధిత శాఖ దృష్టి పెట్టింది. విజయవాడ నుంచి విశాఖకు నేరుగా విమాన సర్వీసులను అందుబాటులోకి తెచ్చేందుకు నిర్ణయించింది. ఈ నిర్ణయం పై విమాన ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కొత్త విమాన సర్వీసులపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకీలక ప్రకటన చేశారు. జూన్ 1 నుంచి కొత్త విమాన సర్వీసును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇండిగో సంస్థ ఆధ్వర్యంలో నడిచే ఈ విమానం ఉదయం ఏడు గంటల 15 నిమిషాలకు విజయవాడలో బయలుదేరుతుంది. ఎనిమిది గంటల 25 నిమిషాలకు విశాఖ చేరుకుంటుంది. తిరిగి ఉదయం 8 గంటల 45 నిమిషాలకు విశాఖ నుంచి బయలుదేరుతుంది. 9 గంటల 45 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ నూతన విమాన సర్వీసు తో విజయవాడ నుంచి విశాఖ వెళ్లే ప్రయాణికులకు కొంతవరకు రవాణా భారం తగ్గనుంది.ఇప్పటివరకు చెన్నై నుంచి విశాఖ వెళ్లే విమాన సర్వీస్ మాత్రమే అందుబాటులో ఉండేది. చెన్నై నుంచి ఉదయం ఎనిమిది గంటల ఐదు నిమిషాలకు విజయవాడ వచ్చే ఈ విమానం.. 8 గంటల 45 నిమిషాలకు విశాఖ బయలుదేరేది. కానీ చెన్నై నుంచి విమానంలో రద్దీ ఎక్కువగా ఉండేది.

## ఏపీ ప్రభుత్వానికి అద్భుతమైన ఆలోచన

-మొదటిపేజీ తరువాయి

ఎలాంటి అడ్డంకులు లేకుండా చేరేలా ఈ సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ శాఖలు ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేలా, ప్రజలకు తక్షణ సేవలు అందించేందుకు కావాల్సిన సాంకేతిక తోడ్పాటును ఈ సంస్థ అందజేస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించడానికి వీలుగా మనమిత్ర పేరిట వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ సేవల కోసం ప్రజలెవ్వరూ కూడా ప్రభుత్వ కార్యాలయాల కు రావాల్సిన అవసరం లేకుండా కేవలం తమ సెల్ ఫోన్ లోని వాట్సాప్ ద్వారానే ప్రభుత్వ సేవలు పొందే సదుపాయం కల్పిస్తున్నామ న్నారు. ప్రస్తుతం 290 వరకు వివిధ రకాల సేవలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కల్పిస్తున్నా మని, రాబోయే రోజుల్లో వెయ్యి రకాల సేవలు ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తామని వివరించారు. ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అర్జీలు పెట్టుకునే సదుపాయం కూడా కల్పించామన్నారు. ప్రజలకు సేవలు అందించడమే కాకుండా ఆ సేవలపైన ప్రజల్లో సంతృప్తి చెందారా లేదా అనేది కూడా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి వాటికనుగుణంగా ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపరుస్తున్నామన్నారు. వాతావరణ మార్పులను నిరంతరం పర్యవేక్షించేలా ఆర్టీజీఎస్ లో ప్రత్యేకంగా అవేర్ హబ్ ఏర్పాటు చేసి, వాతావరణం గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించే ఏర్పాటు చేశామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెద్ద ఎత్తున వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా పయనిస్తోందని చెప్పారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలు డ్రోన్ సేవలు వినియోగించుకునేలా ప్రభుత్వం చేస్తోందన్నారు. భారదేశానికి ఏపీ డ్రోన్ రాజధానిగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజలు డ్రోన్ సేవలను విరివిగా వినియోగించుకునేలా ప్రజలకు ప్రోత్సహిస్తున్నామన్నారు. స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిస్సాఫీ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం పాలనలో, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి సాంకేతికతను వినియోగిస్తున్న తీరు ఆదర్శప్రాయమన్నారు. ప్రభుత్వాలకు ఆర్టీజీఎస్ లాంటి ఒక కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థ ఎంతో అవసరమని, దేశంలో మిగిలిన రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తున్నందుకు తమకెంతో సంతోషంగా ఉందన్నారు.

## మోదీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటాం

**హైదరాబాద్:** పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ చేసిన దాడులు గర్వించదగ్గ విషయమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పహల్గాం ఘటనకు ప్రతీకారం తీర్చుకోవాలని యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రక్షణ దళాలు దీటుగా పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడి చేసి బుద్ధి చెప్పాయన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పవన్ మాట్లాడారు. మోదీ నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామన్నారు. "పహల్గాంలో హిందువులా?కాదా? అని అడిగి మరీ ఉగ్రవాదులు చంపారు. దేశం మొత్తం పుట్టెడు దుఃఖంలో ఉంది. మోదీ నాయకత్వంలో ఉగ్రవాదంపై యుద్ధం జరుగుతోంది. ఈ సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయం పట్ల అందరం గర్వించాలి.. అండగా నిలవాలి. చివరి ఉగ్రవాదిని అంతం చేసేవరకు ఆయన పోరాటం ఆగదు. పాకిస్థాన్‌కు మద్దతుగా ఆలోచించే నాయకులు తమ వైఖరి మార్చుకోవాలి. భారత సైన్యాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలి" అని పవన్ అన్నారు.

## కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు



-మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌ను డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఏఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దీన్ని ఏడీజీ వివేకానంద సిన్హా పర్యవేక్షిస్తున్నారు. సీఆర్పీఎఫ్ ఐజీ రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ ఎప్పటికప్పుడు ఆపరేషన్‌పై ఆరా తీస్తున్నారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి**

మరోవైపు, ఏపీలోని అల్లూరి జిల్లా వై.రామవరం, జీకేవీధి మండలాల సరిహద్దుల్లో భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ క్రమంలోనే రెండు ఏకే-47లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటనాస్థలంలో ఇరుపక్షాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి.

## గిరిజన జాతరకు భారీగా నిధులు

**విజయనగరం :** మన్యం దేవతగా గిరిజనుల దేవతగా పూజలందుకుంటున్న మోదకొండమ్మకు ప్రతి సంవత్సరం మే నెలలో జాతర నిర్వహిస్తారు. ఈ ఏడాది మే 11 నుంచి మూడు రోజుల పాటు జాతర చేయనున్నారు. ఈ మేరకు ఉత్సవ, ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత దీనిని రాష్ట్ర గిరిజన జాతరగా ప్రకటించారు. మొదటి రెండేళ్లు ఏడాదికి 50 లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు. ఆ తర్వాత ఆ లెక్కను కోటికిపెంచారు.మోదకొండమ్మ జాతర ఏటా మే నెలలో రెండో వారంలో నిర్వహించడం ఆనవాయితీ. విశాఖ పట్టణానికి 120 కిలోమీటర్ల దూరంలో పాడేరులో స్వయంభువుగా వెలసింది అమ్మవారు. మోదం అంటే సంతోషం అని అర్థం. గిరుల్లో వెలసిన దేవత కాబట్టి కొండమ్మ అని కలసి...మోదకొండమ్మ అని పూజలందిస్తున్నారు భక్తులు. ఒడిశా కోరాపుట్ జిల్లాలో నందపురం అనే ప్రాంతం కళింగ దేశంలో ఓ రాజ్యంగా ఉండేది. ఆ నందపురాన్ని రాణి మాకలశక్తి, భైరవుడు పాలించేవారు. వీరికి ఏడుగురు కుమార్తెలు, ఓ కొడుకు. వారిలో మొదటి సంతానమే మోదకొండమ్మ. చిన్నప్పటి నుంచీ మహిమలు చూపే మోదకొండమ్మ మహిషాసుర సంహారం సమయంలో ఆదిపరాశక్తికి సహాయపడిందని పురాణాలు చెబుతున్నాయి. మోదకొండమ్మ మేనత్తకు ఏడుగురు కుమారులు ఉండేవారట. దేశిరాజులుగా పిలచే ఆ ఏడుగురిని మోదకొండమ్మ అక్కచెల్లెళ్లు ఏడుగురు వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత పాడేరులో పినవేనం అనే రాతి గుహ వద్ద స్వయంభువుగా కొలువుదీరిందనీ...మోదకొండమ్మ చెల్లెళ్లు కూడా వివిధ ప్రాంతాల్లో వెలిశారని కథనం. కొన్నాళ్లక్రితం ఇక్కడ ఏటా ప్రత్యేక పూజలు చేసేవారు. ఓసారి పూజల అనంతరం అంతా వెళ్లిపోయాక మోదకొండమ్మ తన చెల్లెళ్లతో కలసి విందు ఆరగిస్తోందిట. ఆ సమయంలో పూజారి వెనక్కు వెళ్లాడు. అంతదూరం తిరిగి వచ్చిన పూజారిని చూసి మోదకొండమ్మ...తన దర్శనం కోసం ఇంత దూరం ఎవరూ రావొద్దని చెప్పి...ఈ చెంబు పడేచోట తాను కొలువై ఉంటాయనని విసిరిందట. ఆ చెంబు పడిన చోట అమ్మవారి పాదాలు కనిపించడంతో వాటినే ప్రతిష్టించి పూజలు చేస్తున్నారు భక్తులు.ఆ తర్వాత కాలంలో తహసిల్దార్ దాసరిశర్మ అనే భక్తుడి కలలో అమ్మవారు కనిపించడంతో పాడేరులో ఆలయం నిర్మించారని కథనం.ఏడాది మొత్తం విశేష పూజలు నిర్వహించి ఏడాదికోసారి మే నెలలో మూడు రోజుల పాటు వైభవంగా జాతర నిర్వహిస్తారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా భారీగా తరలివస్తారు. మొదటి రెండు రోజులూ స్థానిక సతకంపట్టు వద్ద అమ్మవారి ఘటాలను మేళతాళాలతో తీసుకొచ్చి పెడతారు. వాటిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు భక్తులు. సాయంత్రం ఆ ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. మూడో రోజు తెల్లవారుజామునుంచే మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు బారులు తీరుతారు. విశేషమైన పూజలు, ఊరేగింపులతో ఉత్సవాలు ముగుస్తాయి. విశాఖ వరకూ ట్రైన్ లేదా బస్సులో చేరుకుంటే అక్కడి నుంచి మోదకొండమ్మ ఆలయానికి బస్సులు, ప్రేవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి.జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో ఏర్పాట్ల ఖర్చు కూడా పెరుగుతోంది అంటున్నారు నిర్వాహకులు. అందుకే ప్రభుత్వం ఇస్తున్న కోటి రూపాయల నిధులను మూడు కోట్లకు పెంచాలని స్థానిక అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

# సంపాదకీయం

## విజ్ఞత కోల్పోతున్న ట్రోల్ దాడులు

కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడిలో భర్తను కోల్పోయిన హిమాన్షి, తండ్రిని కోల్పోయిన ఆరతి మీనన్‌పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వ్యక్తిత్వ హననం జరుగుతున్నది. భర్త వినయ్ నర్వాల్ మృతదేహం ముందు కూర్చుని విలపిస్తున్న హిమాన్షి నర్వాల్ ఫోటో ప్రపంచమంతా వైరల్ అయ్యింది. ఆ ఫోటో ఒక్కటి చాలు! దేశమంతటా ఉగ్రవాద వ్యతిరేకత వెల్లువెత్తడానికి. తండ్రిని కోల్పోయిన కేరళకు చెందిన ఆరతి మీనన్ తన పిల్లలను కాపాడుకున్న తీరు మానవత్వం వున్న ప్రతి ఒక్కరిని కన్నీరు కార్చేలా చేసింది. మన రాష్ట్రానికి చెందిన చంద్రమౌళిని మోకాళ్ళపై కూర్చోబెట్టి భార్య, కూతురు ఎదురుగానే తలలోకి బుల్లెట్లు దించిన తీరును వారు చెబుతుంటే మన ఎదురుగానే జరిగినంత భీతి కలిగింది. ఈ తల్లులు ఇంత శోకంలో కూడా దేశ హితం కోసం ఏది చెప్పాలో, ఏది చెప్పకూడదో విచక్షణతో మాట్లాడారు. శాంతి కావాలి, ఉగ్రవాదాన్ని అంతం చేయండి, చంపిన వారు ముస్లింలే కానీ తిరిగి వెనక్కి రావడానికి సహాయపడిన వారు కూడా ముస్లింలే, కాల్చిన వారి మతాన్ని బట్టి వ్యవహరించకండి.. అని గొప్పగా హితవు పలికారు. మన దేశ గౌరవాన్ని మరో మెట్టు ఎక్కించారు. ఇలాంటి మహోన్నతులపై ఉన్మాదం తలకెక్కిన ముష్కరులు సభ్య సమాజం సిగ్గుపడేలా, నాగరికతను సింధూ నదికి దూరంగా విసిరేసేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. వారు ఉగ్రవాద బాధితులన్న సానుభూతి, మహిళలన్న విజ్ఞత కోల్పోయి నీచాతినీచంగా ట్రోల్ చేస్తున్నారు. హిమాన్షిపై చేసిన ఒక క్రూరమైన పోస్టు "ఈనీ కూడా చంపితే అప్పుడు సపోర్టు చేసేది తురకలకి", "ఇదే తన భర్తను చంపడంలో సహాయం చేసింది". ఆరతి మీనన్‌పై కూడా ఇలాంటి ఘోరమైన పోస్టులు పెడుతున్నారు. సాయుధ ఉగ్రవాదులు వారి ఆత్మీయులను బలిగొంటే, ఈ సోషల్ మీడియా ఉగ్రవాదులు వారి వ్యక్తిత్వాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని, దేశం పట్ల వారి నిబద్ధతను బలి తీసుకుంటున్నారు. ఉన్మాదం తలకెక్కిన వారి చేతిలో వున్న ఆయుధాలే కాదు, సామాజిక మాధ్యామాలు కూడా మనల్ని బలి తీసుకుంటాయి. వాటి నుండి వచ్చిన తూటాలు శరీరాన్ని ఛిద్రం చేస్తే, వీటి నుండి వచ్చే పోస్టులు మనసును ధ్వంసం చేస్తాయి. వాడు మతాన్ని అడిగి మరీ కాల్చేస్తే, వీడు మానవత్వాన్ని మొలకెత్తకుండా కాల్చేయజూస్తున్నాడు. బయటకు వేర్వేరుగా కనిపించే ఈ ఉగ్రవాదులు నిజంగా వేరు కాదు. వారి లక్ష్యం మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, మత ఘర్షణలు పెట్టడం, ప్రజల ఐక్యతను చీల్చడం. ఏప్రిల్ 22న జమ్ము కాశ్మీర్ పెహల్గాం ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడాన్ని దేశం యావత్తు నిరసించింది, బాధితులను తమ కుటుంబ సభ్యులుగా భావించి విలపించింది. మతాలకు, ప్రాంతాలకు అతీతంగా దేశమంతటా ఒకే కంఠంతో ఉగ్రవాద చర్యలను ఖండించింది. గతంలో ఎన్నడూ లేనంతగా కాశ్మీర్ ప్రజలు కూడా ఈ అమానుష కాండను తీవ్రంగా వ్యతిరేకించారు. అందరికంటే ముందుగా అక్కడ బంద్ పాటించారు. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలను అక్కున చేర్చుకున్నారు, మనో ధైర్యాన్ని ఇచ్చారు, తక్షణ సపర్యలు చేశారు. గాయపడిన వారిని కిలో మీటర్ల కొద్దీ మోసుకు వచ్చారు. చనిపోయినవారికి మార్చురీ వద్ద ఏర్పాట్లు చేసి శోక హృదయాలతో సాగనంపారు. బాధితులకు ఆశ్రయం ఇచ్చారు. కలిగిన దాంట్లోనే భోజనాలు పెట్టారు. ఉచితంగా ఆటో, ట్యాక్సీల్లో రైల్వేస్టేషన్, విమానాశ్రయాలకు చేర్చారు. ఇలాంటి కొన్ని సంఘటనలు సోషల్ మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిశాయి. బయటకు రాని, రికార్డు కాని అనేక రూపాల్లో స్థానికులు మతం, కులం, ప్రాంతం బట్టి కాకుండా సాటి మనుషులుగా, తమ అతిథులుగా అనుకుని స్పందించారు. మానవత్వంతో, భారతీయులమనే భావనతో చేశారు. వారికి తెలుసు ఉగ్రవాదానికి భిన్నంగా ప్రవర్తించినా, విమర్శించినా జరిగే పరిణామాలు ఏమిటో వారికి అనుభవంలో చాలా తెలుసు, అయినా ఎందుకు స్పందించారు. మేము వారు వేరువేరు, మతం చాటున ఒకే తీరుగా చూడద్దొండి అంటూ పర్యాటకులను వేడుకున్నారు. మనమంతా భారతీయులం అని గొంతెత్తి చాటారు. ఆయుధాలు కలిగిన ఉన్మాదులతో తలపడితే ఏం జరుగుతుందో తెలిసి కూడా సయ్యద్ ఆదిల్ షా ను ఆత్మార్పణకు సిద్ధపడేలా చేసింది ఒకవైపు కాల్పులు జరుగుతుంటే గాయపడిన పిల్లవాడిని 11 కి.మీటర్లకు పైగా వీపున మోసుకుంటూ హుస్సేన్‌ను ఆ కొండల్లో నడిచేలా చేసింది నిజమైన మానవత్వం, అదే నిజమైన భారతీయత. కళ్ళ ముందు తమ వారిని కోల్పోయి దుఖ:ంలో వున్నవారికి ఈ దృశ్యాలు ఎక్కడో జీవితం పట్ల, దేశం పట్ల ప్రేమను, నమ్మకాన్ని నిలిపాయి. అందుకే ఇళ్ళకు తిరిగివచ్చిన బాధితుల్లో ఏ ఒక్కరూ కూడా స్థానిక ముస్లింలను ఒక్క మాట అనకపోగా వారిని అనేక విధాలుగా మెచ్చుకున్నారు. ఇదే దేశంలోని సామాజిక మాధ్యమాల ముష్కరులకు కోపం తెప్పించింది. ఈ దాడులను ఆధారంగా చేసుకుని హిందూ, ముస్లిం మత ఘర్షణలు పెట్టాలనుకునే వారు విచక్షణ కోల్పోయేలా చేసింది. భర్తలను, తండ్రులను, అన్నలను కోల్పోయిన బాధితులంతా ఉగ్రవాదుల దుర్మార్గాలతో పాటు దేశీయ ముస్లింల మీద ఏదో రూపంలో విరుచుకుపడాలని భావించిన ఉన్మాదుల ఆగ్రహానికి కారణమైంది. హిమాన్షి ఏం మాట్లాడింది! "నా భర్త ఎక్కడున్నా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని%ొ%దేశం మొత్తం అతని కోసం ప్రార్థించాలని%ొ%నేను కోరుకుంటున్నాను. ముస్లింలు లేదా కాశ్మీరీలను ప్రజలు వ్యతిరేకించాలని మేం కోరుకోవడంలేదు. మాకు శాంతి కావాలి, శాంతి మాత్రమే కావాలి. అయితే మాకు న్యాయం కావాలి". ఈ వాఖ్యలు చేసిన ఆమెలో ఎంతటి స్థిరచిత్తం వుందో, ఎంతటి విజ్ఞత వుందో మెదడు వున్న ప్రతి ఒక్కరిని ఆలోచింపచేసింది. తమ ఆయుష్షు కూడా పోసుకుని నూరేళ్ళు బతకమని ఎన్ని హృదయాలు దీవించాయో! ఈ ఆణిముత్యాలు కొందరికి రుచించలేదు. ద్వేషంతో ఊగిపోయే కషాయ నెటిజన్లు ఆమెపై విరుచుకు పడ్డారు. హిమాన్షి జెఎన్‌యు లో చదివిందని, తన భర్త మరణాన్ని సామాజిక, రాజకీయ నిచ్చెన ఎక్కడానికి ఒక అవకాశంగా చేసుకొని ఇలాంటి శాంతి సందేశాలు ఇస్తుందని, కాశ్మీరు హానీమూన్ 'ఆమె ఏర్పాటు చేసిందని' ప్రభుత్వం ఇచ్చే పరిహారం, పెన్షన్ ఆమెకు ఇవ్వకూడదని, ఆమెకు ముస్లిం స్నేహితులు వున్నారని, 'ఆమె జాతి వ్యతిరేకి', 'వారి%ొ%సానుభూతిపరురాలు' అంటూ తమ చేతికి, నోటికి అడ్డూ అదుపు లేకుండా పోస్టులు పెడుతున్నారు. ఈ దుర్మార్గంపై జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయ రహత్కర్ స్పందించారు. ఇలాంటి పోస్టులు వెంటనే ఆపండి, మహిళకు తన అభిప్రాయాలు, ఆలోచనలు చెప్పే హక్కును కాలరాస్తారా? అంటూ ప్రశ్నించారు. ఏదైనా అంగీకారం లేదా భిన్నాభిప్రాయాన్ని ఎల్లపుడూ మర్యాదగా, రాజ్యాంగ హద్దులకు లోబడి స్పందించాలని చెప్పారు. కేరళకు చెందిన ఆరతి మీనన్ తన పిల్లలను వెంటబెట్టుకుని తండ్రితో కలిసి కాశ్మీరుకు వెళ్లింది. తన తండ్రిని కాల్చవద్దని ఉగ్రవాదులను ఎంతగా వేడుకున్నా కనికరించకుండా అతి సమీపం నుండి ఆయనను కాల్చేశారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయిన ఆరతి మీనన్‌కు ఇద్దరు స్థానిక యువకులు అండగా నిలిచి ఆమె పిల్లలను చేరదీసి, ఆమె తండ్రి శవానికి పరీక్షలు పూర్తి చేయించి, ప్రయాణ ఏర్పాట్లు చేసి పంపారు. కేరళకు తిరిగివచ్చిన ఆరతి స్పందిస్తూ "ఈ ప్రయాణం నాకు ప్రియమైన తండ్రిని దూరం చేసింది. కానీ ఇద్దరు సోదరులను ఇచ్చింది. ఒకరు డ్రైవర్ ముసాఫిర్, మరొకరు సమీర్. వారు ప్రతి విషయంలో నాకు తోడుగా నిలిచారు. తెల్లవారుజామున మూడు గంటల వరకు నా దగ్గరే వుండి నన్ను ఒక సోదరిగా చూసుకున్నారు" అని చెప్పింది. మతం-ఉగ్రవాదం- మానవత్వం వేర్వేరు అని తన అనుభవం నుండి చెప్పడాన్ని భారత్ మాతా కీ జై అనే వారు సహించలేకపోయారు. "ఆమె లాంటి పిల్లలు పుట్టడం కంటే లేకుండా వుండటమే మంచిది", "ఆమె మాటలు అసహ్యకరం" అంటూ అత్యంత నీచంగా దుర్భాషలాడుతూ పోస్టులు పెట్టారు. ఇలాంటి పోస్టులు పెడుతున్నవారి ఫేస్‌బుక్ ప్రొఫైల్ ఫోటోల్లో శ్రీరాముడు, ఆంజనేయస్వామి బొమ్మలు, కాషాయ జెండా, అఖండ భారత ఫోటోలు వుంటున్నాయి. ఇంత నీచంగా ట్రోల్ చేసే ధైర్యం వీరికి అక్కడి నుండే అందుతుంది. శీలం, జ్ఞానం, గర్భ సాంస్కారం, హిందూ సంస్కృతి, 'నారీ శక్తి వందన్ చట్టం', బేటీ బచావో' అంటూ చెప్పే మాటలకు వీరి చేతలకు నకశిఖ పర్యంతమంత తేడా వుంది. కాశ్మీర్ దారుణంపై దేశమంతా ఉగ్రవాదం, దానికి ఆధారంగా వున్న పొరుగు దేశంపై ఆగ్రహావేశాలతో వుంటే, ఉగ్ర బాధితులనే బాధించగల వారిని మనుషులు అనగలమా? బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన వారి విడుదల ఉత్సవాలు, ఉత్తరప్రదేశ్ ఉన్నావోలో దళిత మహిళపై హత్యాచారానికి పాల్పడిన నేరగాళ్ళ ఊరేగింపు, కాశ్మీర్ కథువాలో ఎనిమిదేళ్ళ బాలికను గుడిలో అత్యాచారం చేసి చంపేసిన నిందితులు తల ఎత్తుకుని దేశ పాలకుల పక్కన నిలచిన ఫోటోలు, మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన వీడియోలు దేశమంతా ప్రచారం చేయగలిగే నీచ మనస్తత్వం ఎవరికి వుంటుంది?

# ముందడుగు వేయని 'స్టార్టప్'



భారతదేశంలో అధిక శాతం మంది స్వయం ఉపాధి రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇది ప్రపంచంలోనే అత్యధికమని ఐఎస్ఒ నివేదించింది. ఒకరి మీద ఆధారపడకుండా స్వయం ఉపాధి చూసుకోవాలి అని మన నేతలు నిత్యం చేసే ప్రచారాన్ని చూసి ఇది మంచిది అని అనుకోడానికి లేదు. ఎందుకంటే భారతదేశంలో ముఖ్యంగా స్వయం ఉపాధి రంగం దారుణంగా ఉంది. స్వయం ఉపాధి రంగం లో స్థిరపడాలనుకునే వారికి ప్రోత్సాహం ఉండదు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ వ్యవస్థలలో భారతదేశం అగ్రగామిగా ఉండేది. ప్రతి సంవత్సరం వేలాది కొత్త ఆలోచనలతో, వెంచర్లు, ప్రణాళికలు ఉద్భవిస్తున్నాయి. స్టార్టప్ ఇండియా వంటి ప్రభుత్వ చొరవతో ప్రోత్సహించబడిన సహాయక వాతావరణం ఉన్నప్పటికీ, అద్భుతమైన సంఖ్యలో స్టార్టప్‌లు ఒకటి రెండు సంవత్సరాలకు మించి మనుగడ సాగించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయి. దాదాపు 80% - 90% భారతీయ స్టార్టప్‌లు మొదటి ఐదు సంవత్సరాలలోపు మూసివేయబడుతున్నాయని. 8 శాతం మాత్రమే దశాబ్దం దాటి మనుగడ సాగిస్తున్నాయి అని పరిశ్రమ డేటా వెల్లడిస్తుంది. ఈ వైఫల్యాల మూల కారణాలపై ఇటీవల లోతైన పరిశోధన క్లిష్టమైన సర్వే, నిజ నిర్ధారణ కమిటీలు, నిర్లక్ష్యం చేయబడిన ప్రాథమికాలను వెల్లడిస్తుంది. ఉత్పత్తి మార్కెట్ ఫిట్ లేకపోవడం, అనేక స్టార్టప్‌లు తమ సమర్పణలను నిజమైన మార్కెట్ అవసరాలకు సమలేఖనం చేయడంలో విఫలమవుతాయి. వినూత్న ఆలోచనలు తరచుగా తమ సమయానికి చాలా ముందుండటం లేదా లక్ష్య జనాభాకు అసంబద్ధంగా ఉండటం ద్వారా మార్క్‌ను కోల్పోతాయి. పేలవమైన ఆర్థిక ప్రణాళిక, అసమర్ధమైన నగదు ప్రవాహ నిర్వహణ, ప్రారంభ దశ ఆదాయ అంచనాలలో అతిగా చూపించడం, ఆశావాదం స్థిరమైన కార్యకలాపాలకు దారితీస్తాయి. అసమర్థ నాయకత్వం, కోర్ టీంలో సఖ్యత లేకపోవడం, ఆలోచనల్లో సారూప్యత లేకపోవడం, బృంద సంఘర్షణలు, వ్యవస్థాపకులు తరచుగా నిర్ణయం తీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారు. స్టార్టప్ ప్రధాన భాగాన్ని బలహీనపరుస్తున్నారు. తగినంత నిధులు లేకపోవడం లేదా తప్పుదారి పట్టించడం, స్టార్టప్‌లు తగినంత మూలధనాన్ని సేకరించడం లేదా నిధులను దుర్వినియోగం చేయడం వలన అకాల స్కేలింగ్ లేదా కార్యాచరణ విచ్ఛిన్నం సంభవిస్తాయి. బలహీనమైన మార్కెటింగ్, కస్టమర్ సముపార్జన వ్యూహా లు, బలమైన బ్రాండింగ్, లక్షిత ప్రచారం లేకుండా అనేక స్టార్టప్‌లు పోటీ మార్కెట్లలో పట్టు సాధించడంలో విఫలమవుతాయి. నియంత్రణ, సమ్మతి సవాళ్లు, నిపుణుల మార్గదర్శకత్వం లేకుండా భారతదేశం సంక్లిష్టమైన చట్టపరమైన దృశ్యాన్ని నావిగేట్ చేయడం తరచుగా వైఫల్యాలకు దారితీస్తుంది.

సాంకేతికత ఉత్పత్తి, అభివృద్ధి సమస్యలు, సాంకేతిక నైపుణ్యం లేకపోవడం, పేలవమైన స్కేబిలిటీ తరచుగా ఉత్పత్తి విశ్వసనీయతను అలాగే వినియోగదారు సంతృప్తిని దెబ్బతీస్తాయి. సరికాని స్కేలింగ్ వ్యూహాలు, స్థిరమైన కార్యాచరణ పునాది లేకుండా చాలా వేగంగా లేదా చాలా నెమ్మదిగా స్కేలింగ్ చేయడం వల్ల అవకాశాలు లేదా ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుంది. కస్టమర్ ఫీడ్ బ్యాక్‌ను నిర్లక్ష్యం చేయడం, వినియోగదారు ఇన్‌పుట్‌ను విస్మరించడం, ఫీడ్ బ్యాక్ ఆధారంగా పునరావృతం చేయడంలో విఫలమవడం నిష్క్రమణ, గందరగోళానికి దారితీస్తుంది. తీవ్రమైన మార్కెట్ పోటీ, తమను తాము వేరు చేసుకోలేని స్టార్టప్‌లు బాగా నిధులు సమకూర్చుకున్న లేదా మరింత వినూత్నమైన పోటీదారులకు నష్టపోతాయి. పేలవమైన నియామకం, బృంద నిర్మాణం, బలహీనమైన టీం డైనమిక్స్, అస్పష్టమైన పాత్రలు తక్కువ ధైర్యం, అసమర్థతకు దారితీస్తాయి. మార్కెట్ సామర్థ్యాన్ని తప్పుగా అంచనా వేయడం, సమగ్ర పరిశోధన లేకుండా అతిగా సంతృప్త లేదా తక్కువ డిమాండ్ ఉన్న మార్కెట్లలోకి ప్రవేశించడం వల్ల పనితీరు తగ్గడం వలన నిష్క్రమణ జరుగుతుంది. భారతదేశం ఫ్లిప్‌కార్ట్, జొమాటో, పెటిఎం వంటి యునికార్న్‌ల విజయగాథలు ఉన్నప్పటికీ అధిక వైఫల్య రేటు వాస్తవిక ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన అమలు, నిరంతర మార్కెట్ తక్షణ అవసరాన్ని హైలైట్ చేస్తుంది. ఔత్సాహిక వ్యవస్థాపకులకు సందేశం స్పష్టంగా ఉంది. ఆవిష్కరణ మార్కెట్ వాస్తవాలపై ఆధారపడి ఉండాలి. బలమైన నాయకత్వం ద్వారా మద్దతు ఇవ్వాలి. అలాగే దృఢమైన ఆర్థిక కార్యాచరణ వ్యూహాలపై నిర్మించబడాలి. స్వభావ రీత్యా భారతీయులు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడనివారు, స్వార్థపరులు, దురాశపరులు. ఇలాంటి లక్షణాలు కొత్త వెంచర్‌కు అసురక్షిత వాతావరణాన్ని సృష్టిస్తాయి. వాస్తవానికి బ్యాంకులు, ప్రైవేట్ పెట్టుబడిదారుల నుంచి నిధులు పొందడం ఒక సమస్య.

ప్రభుత్వ మద్దతు కేవలం ప్రచారం తప్ప ఆచరణలో శూన్యం. కొత్త ఆలోచనలు ప్రోత్సహించడానికి ఎటువంటి వ్యవస్థ లేదు. భారతీయ ప్రజలు కొత్త ఉత్పత్తులను అంగీకరించరు. స్టార్టప్‌ల వైపు నుండి, ఇందులో పాల్గొన్న వ్యక్తులు వారు అందించే దానికంటే డబ్బుపై ఎక్కువ శ్రద్ధ వహిస్తారు. పని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉండదు. పని సంస్కృతి చెత్తగా ఉంటుంది, కంపెనీ పట్ల విధేయత లేదు. వ్యవస్థాపకుడు ఉద్యోగుల పట్ల, ఉద్యోగులు యజమాని పట్ల విధేయత చూపరు. క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశానికి మెదడు లేదు, శక్తి లేదు, పర్యావరణం లేదు లేదా కొత్త ఆలోచనలను పెంపొందించడానికి వాటిని లాభదాయక వ్యాపారాలుగా మార్చడానికి డబ్బు లేదు.

# అనారోగ్యాన్ని 'కొని' తెచ్చుకోవద్దు!




మండు వేసవికాలం. రంగురంగుల మామిడి పండ్లతో మార్కెట్లు కళకళలాడు తుంటాయి. "పళ్లల్లో రారాజు" అని ముద్దుగా పిలుచుకునే ఈపండు కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, ఈమధ్యకాలంలో "అంతా మాయాబజార్" అన్న చందంగా, సహజ సిద్ధంగా కాకుండా కృత్రిమ పద్ధతుల్లో మామిడి పండ్లను త్వరగా పండించేస్తున్నారు. ఇలాంటి "పైపూతలు" పూసిన పండ్ల వల్ల ప్రజల ఆరోగ్యం ఆగమవుతున్నదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌కు వచ్చిన మామిడి పండ్లు మంచివా? లేదంటే కృత్రిమంగా పండించినవా? వాటిని ఎలా గుర్తించాలన్న విషయంలో ప్రజలకు సరైన అవగాహన లేదు. దీంతో అనారోగ్యాన్ని 'కొని'తెచ్చుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బంగనపల్లి, నీలం, రసం, తోతాపురి, బేనిషన్ వంటి రకాలకు మంచి పేరుంది. కానీ, నాసిరకం పండ్లను గుర్తించక అనారోగ్యం బారినపడుతున్నారు. మామిడి కాయలను "నిమిషాల్లో నిప్పులు కక్కేలా" పండించడానికి వ్యాపారులు ఎక్కువగా వాడుతున్న రసాయనం కార్బైడ్, దీనినే కాల్షియం కార్బైడ్ అని కూడా అంటారు. ఇది చూడటానికి పైకి మెత్తగా లోపల వెన్నపూస అన్నట్లు తెల్లగా లేదా బూడిద రంగులో ఉంటుంది. ఈ కార్బైడ్‌ను మామిడి కాయల మధ్యలో పెట్టి నీళ్లు చల్లితే చాలు, అగ్గి రాజుకున్నట్టు ఎసిటిలీన్ అనే వాయువు విడుదలవుతుంది. ఇది సహజంగా పండ్లు పండడానికి కారణమయ్యే ఇథిలీన్ వాయువును పోలి ఉన్నప్పటికీ, అసలు సిసలైంది కాదు, అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. కొంతమంది వ్యాపారులు తక్కువ ఖర్చు ఎక్కువ లాభం అనే సూత్రంతో నిషేధిత రసాయనమైన ఇథిఫోన్‌ను కూడా అధిక మోతాదులో వాడుతున్నారు. ఈ రసాయనాన్ని మామిడి పండ్లు ముగ్గేందుకు ప్రత్యక్షంగా ఉపయోగించడానికి అనుమతి లేదు. ఇది కూడా ఇథిలీన్‌ను విడుదల చేస్తుంది, కానీ దీని అధిక వినియోగం పండ్ల నాణ్యతనుమట్టి కొట్టేలా చేస్తుంది, ఆరోగ్యానికి 'చేటు చేస్తుంది. ఇథిఫోన్‌ను పొడి రూపంలో చిన్న సాచెట్‌లలో ప్యాక్ చేసి పండ్లతో నేరుగా సంబంధం లేకుండా ఉపయోగించవచ్చు. ఈ సాచెట్‌లు ఇథిలీన్ గ్యాస్‌ను విడుదల చేస్తాయి. తద్వారా పండ్లు పండుతాయి. అయితే, ఇథిఫోన్‌ను నేరుగా పండ్లపై చల్లడం లేదా అధిక మోతాదులో ఉపయోగించడం ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) నిబంధనలకు విరుద్ధం. ఎఫ్ఎస్ఎస్ఎఐ చట్టాల ప్రకారం కాకుండా విరుద్ధంగా వీటిని వాడితే "మూల్యం చెల్లించక తప్పదు". ఈ విషయంలో కోర్టులు కూడా కాల్షియం కార్బైడ్ వాడకాన్ని తీవ్రంగా పరిగణించాయి. ఢిల్లీ హైకోర్టు దీన్ని విషం ఇవ్వడం తో సమానమని "తీర్పు చెప్పింది". ఇతర రాష్ట్రాల కోర్టులు కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాయి. కార్బైడ్, ఇథిఫోన్ వంటివాటితో పండించిన మామిడి పండ్లను తింటే ఆరోగ్యం గుల్లనే అవుతుంది. కార్బైడ్‌లో ఆర్సెనిక్, ఫాస్పరస్ వంటి విషపు కుంపట్లు ఉంటాయి. వీటి ప్రభావంతో తలనొప్పి, కళ్లు తిరగడం, వికారం, వాంతులు, కడుపు నొప్పి, అతిసారం వంటి సమ స్యలు చుట్టుముడతాయి. దీర్ఘకాలికంగా ఇది నాడీ వ్యవస్థను కుప్పకూల్చే ప్రమాదం ఉంది. గర్భిణులు, పిల్లలపై దీని ప్రభావం ఉంటుంది. ఇంకా చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కడుపులో మంట వంటి ఇబ్బందులు కూడా ఉంటాయి. ఇది కాలేయం, మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది. దీన్ని గుర్తించేదెలా? అన్న సందేహం ఎవరికైనా వస్తుంది. సహజంగా పండిన పండ్లు ఒకే రంగులా ఉండదు, అక్కడక్కడ కొద్దిగా ఆకుపచ్చగా ఉంటాయి. కృత్రిమంగా పండించినవి మాత్రం మెరుగు పెట్టినట్టు ఒకే రంగులో మెరిసిపోతుం టాయి. సహజ పండ్లకు నోరూరించే తీయటి వాసన ఉంటుంది, కానీ వీటికి అంత వాసన ఉండదు, లేదా రసాయనాల ముక్కు చీదుకునే వాసన వస్తుంది. సహజ పండ్లు మెత్తగా ఉంటే, కృతిమపండ్లు పైకి మెత్తగా ఉన్నా లోపల రాయిలా గట్టిగా ఉంటాయి. కొన్నిసార్లు వాటిపై నల్లటి మచ్చలు కూడా కనిపిస్తాయి. రుచిలో కూడా తేడా ఉంటుంది, సహజ పండ్లు పూర్తిగా తియ్యగా ఉంటే, వీటికి రుచి అంతగా ఉండదు లేదా పుల్లగా అనిపించవచ్చు. ఒకవేళ మీరు పొర పాటున ఇలాంటి పండ్లను కొంటే, వాటిపై ఉండే రసాయనాలను కొంత వరకు తగ్గించడానికి నీటితో బాగా కడగడం, ఉప్పు నీటిలో, వెనిగర్ లేదా బేకింగ్ సోడా ద్రావణంలో నానబెట్టడం వల్ల ఉపరితలంపై ఉండే రసాయనాలు కొంత వరకు పనిచేస్తా యి. కానీ పూర్తిగా తొలగించలేమన్నది గుర్తుంచు కోవాలి. అధికారులు కూడా కృత్రిమపండ్లు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మార్కెట్లలో విరివిగా నాణ్యత పరీక్షలు చేయాలి. ప్రజలకు కూడా సరైన అవగాహన కల్పించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యతగా భావించాలి.

## మానవీయ స్వచ్ఛంద సేవలో అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ

నోబెల్ శాంతి బహుమతి-1901 గ్రహీత హెన్రీ డ్యునాంట్ 1864లో నిర్వహించిన జెనీవా సమావేశంలో తీర్మానించిన ప్రకారం అంతర్జాతీయ మానవీయ దాతృత్వ స్వచ్ఛంధ సంస్థగా రెడ్ క్రాస్ ప్రారంభం కావడం, 192 నేషనల్ సొసైటీస్గా విస్తరించి 17 మిలియన్ల స్వచ్ఛంధ కార్యకర్తలతో నేడు ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంధ సంస్థగా నేటికీ అప్రతిహతంగా తన మానవీయ సేవలకు ప్రపంచ నలుమూల విస్తరించి కొనసాగుతున్నది. "మానవత్వంతో శాంతి వైపు (విత్ హుమానిటీ, టువర్డ్స్ పీస్)" అనే నినాదంతో ఒక తటస్థ, నిష్పాక్షిక మానవీయ సంస్థగా రెడ్ క్రాస్ నేడు ప్రపంచవ్యాప్తంగా తన సేవాహస్తాలను విస్తరించి ముందుకు సాగుతోంది. ప్రపంచ రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ దినోత్సవం-2025 ఇతివృత్తంగా "మానవీయతను పోషిస్తూనే: విశ్వాసం, సహాయం, స్వస్థత (కీపింగ్ హుమానిటీ ఎలైవ్ : హోప్, హెల్ప్, హీల్)" అను అంశాన్ని తీసుకోని అవగాహన కార్యక్రమాలను రూపొందించారు. రెడ్ క్రాస్ స్వచ్ఛంధ సేవకులు ప్రతికూలమైన ప్రమాదకరమైన మారుమూల ప్రాంతాల్లో సహితం ధైర్యంగా తమ అత్యవసర సేవలైన ఆహారాన్ని అందించి ఆకలి చావులు ఆపడం, ప్రకృతి వైపరీత్యాల సమయం అవసర సేవలు అందించడం, వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవడం, యుద్ధ బాధితులను ఆదుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆపన్నహస్తం అందించడం, అంటువ్యాధులు ప్రభలినపుడు రక్షణ గొడుగుగా నిలవడం లాంటి అసంఖ్యాక అత్యవసర సేవలను కొనసాగిస్తున్నారు.

# చనిపోయిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలి

## సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

**బద్వేల్ మే 7 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలో బుధవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఉద్యోగ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా బద్వేల్ మున్సిపల్ వర్కర్స్అ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం నుండి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మోకాళ్లపై నిలబడి కార్మికులు తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాములో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తున్న సమయంలో టిడిపి నాయకులు మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ సమస్యలన్నింటిని పరిష్కారం చేస్తామని చెప్పి హామీలు ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్న సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమని అలాగే స్థానిక మున్సిపాలిటీలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగ -ఉపాధి అవకాశాలు మరియు ఎక్స్గ్రేషియాలు, మట్టి ఖర్చుల డబ్బులు కూడా చెల్లించకపోవడం చాలా బాధాకరమని, గత సమ్మె కాలపు వేతనం మంజూరు చేయలేదని, పారిశుధ్య కార్మికులకు ఇవ్వవలసిన రక్షణ పరికరాలను సైతం ఇచ్చేందుకు అనుమతులు లేవని చెప్పడం హాస్యాస్పదమని, కార్మికుల సమస్యల పట్ల అధికారుల మాటలు చూస్తే అమోఘమని ఆచరణ ఏమో శూన్యమని ఎద్దేవ చేశారు. ఇప్పటికైనా బడుగు బలహీన వర్గాల కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలని



లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, పట్టణ నాయకులు ఎస్. రాయప్ప, యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యామ్ ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాలహరి, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శి బద్వేల్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి కాలువ శివకుమార్, పట్టణ కమిటీ సభ్యులు పద్మిశెట్టి రామయ్య, ఇండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

## నిరుద్యోగ భృతి రూ. 3000,తక్షణమే విడుదల చేయాలని డిమాండ్.

**పోడూరు /ఆచంట, మే 7,ప్రజాజ్యోతి న్యూస్.** కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో నిరుద్యోగులందరికీ నెలకు మూడువేల రూపాయల నిరుద్యోగ భృతి తక్షణమే విడుదల చేయాలని డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.ఎన్ శర్మ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు,మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు 101 వ వర్ధంతి సంధర్భంగా స్థానిక కొత్తూరు సెంటర్ 1వ వార్డు ఉయ్యాలతాళ్ళ వద్ద బుధవారం డి.వై.ఎఫ్.ఐ,బాలల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత సీతారామరాజు చిత్రపటానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చుందూరి వెంకటసత్యన్నారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో శర్మ మాట్లాడుతూ 2024 మే లో జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి మేనిఫెస్టోలో తొలి హామీగా రాష్ట్రంలో నిరుద్యోగులకు రూ.మూడు వేల రూపాయలు భృతి అందిస్తామని హామీ ఇచ్చిందని తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతికి సంబంధించిన హామీలపై నోరు మెదపలేదమని ఆవేదన వ్యక్తం చేసారు. నిరుద్యోగులు సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న మెగా %ఔజు% నోటిఫికేషన్ లో అనేక సాంకేతిక సమస్యలతో అభ్యర్థులు సతమతమవుతున్నారని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం డి.ఎస్.సి అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు.కార్యక్రమంలో డి.వై.ఎఫ్ ఐ నాయకులు జి.మోహన్ కుమార్,అద్దంకి మణికిరణ్, బాలల సంఘం నాయకులు




శ్రీపాద ప్రజ్వల,శ్రీపాద ప్రభవ, తమరాపు జితేంద్ర,తమరాపు మౌనిక,ఐద్వా నాయకురాలు యశోద సత్యవాణి, ప్రజా సంఘాల నాయకులు పి.మోహన్రావు,తోటపల్లి సత్యన్నారాయణ,బండి రంగారావు,మేకా జోష్నిక,మేకా పునర్నవి,ఒబిలిశెట్టి బావేష్,ఎ. ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం విఆర్పిలు చేతివాటం

**అనంతగిరి.7.ప్రజా జ్యోతి.** వలస కూలీలు నివారణలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడితే.ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పథకాలను కొందరు కింద స్థాయ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. అనంతగిరి మండలం పరిధి 24. గ్రామపంచాయతీల లో విలేజ్ రిసోర్స్ పర్సన్ లుగా (వీ.ఆర్పీ.లు ) ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న కొంతమంది వీ.ఆర్పీ.లు ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనులు కల్పించాలన్న. కొత్తగా జాబ్ కార్డులు పొందాలన్నా. వీ.ఆర్పీ.లకు తగిన ముడుపులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ అనంతగిరి మండల నాయకులు మోస్య రంజిత్ వి. శంకర్రావు. చిట్టిబాబు. తదితరులు బుధవారం నాడు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవినీతి.అక్రమాలు. చోటుచేసుకున్నాయని కొత్త ఉపాధి హామీ పథకం జాబ్ కార్డ్ మంజూరు కొరకు.కొందరు వీ.ఆర్పీ.లు ఒక్కక్క కూలి నుండి 500 రూపాయలు మొదలుకొని 2000 రూపాయల వరకు అక్రమ వసూలుకు పాల్పడుతున్నారని నాయకులు తీవ్రంగా ఆరోపించారు.ఈ విధంగా 50మంది కూలీలా నుండి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయని నాయకులు వెల్లడించారు. పై విషయమై అనంతగిరి మండలం ఉపాధి హామీ పథకం అధికారి ఏ.పీ.ఓ. దృష్టికి నాయకులు తీసుకెళ్లిన సంబంధిత శాఖ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాయకులు రంజిత్. శంకర్రావు తెలిపారు. అక్రమ వసూలు పై ఉపాధి హామీ



పథకం శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కి (పి.డి.) ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు..

# మహిళలు దైవంతో సమానం...

# భారతదేశంలో ప్రతిరోజు మహిళా దినోత్సవం

మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాధీశ్వరి శ్రీ శ్రీ శ్రీ రమ్యానంద భారతి స్వామినీ..

**మే 7,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి కొత్త వీధిలో వెలసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయము నందు అమ్మవారి జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవముగా జరిగాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానము మేరకు మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాధీశ్వరి శ్రీ శ్రీ శ్రీ రమ్యానంద భారతి స్వామినీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి వజ్రాలతో పొదిగిన తిలకం బొట్టు, సారె సమర్పించారు. ఈ సందర్భంగా మాతాజీ మాట్లాడుతూ నారీ ఏవ నారాయణీ, ఆ నారాయణి నారీ రూపంలో అప్పుడప్పుడు తన రూపాన్ని మానవాళి కి దర్శనము ఇస్తూ ఉంటుంది, ఆ విధముగా కారణజన్ములుగా జన్మించినటువంటి వారే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అని వివరించారు.ప్రతి నారీ కూడా ఒక నారాయణి అంటే దేవతతో సమానమని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరంలో ఒకరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు, మన భారతదేశంలో ప్రతిరోజు ఏదో ఒక విధముగా దేవతలను ఆరాధన చేస్తుంటాము కనుక ప్రతిరోజు మనకు మహిళా దినోత్సవముతో సమానము అని అనుగ్రహభాషణ చేశారు. ఈ కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



## రహదారి సౌకర్యం లేక సీతంపేట గ్రామ గిరిజనులు ఇక్కట్లు.

**అనంతగిరి. 7 (ప్రజా జ్యోతి న్యూస్)** మండల కేంద్రానికి సుమారు 15.కిలోమీటర్ల దూరానగల సీతంపేట గ్రామానికి రహదారి సౌకర్యం లేక.స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సీతంపేట ప్రజలు బుధవారం నాడు స్థానిక విలేకరులకు సమాచారం అందించారు. రహదారి నిర్మాణం కోరుతూ%ఐ% అనేకసార్లు డివిజన్. మండల స్థాయి అధికారుల కు ఫిర్యాదుల రూపంలో అర్జీలు పెట్టుకున్న. సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని .గ్రామ గిరిజనులు పాడి రామారావు.పాంగి లక్ష్మణరావు. జి గంగులు తదితరులు తెలిపారు.అత్యవసర సమయంలో కాలినడకన సమీప పంచాయతీ కేంద్రానికి,చేరుకొని అవసరాలు తీర్చుకోవలసిన దుస్థితి సీతంపేట గ్రామ గిరిజనులు కుఏర్పడిందని గిరిజనులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రహదారి నిర్మాణం చేపట్టి స్థానిక ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అసంపూర్తి నిర్మాణంతో కొత్తవలస గ్రామ అంగనవాడి భవన నిర్మాణం.



**అనంతగిరి.7. (ప్రజా జ్యోతి న్యూస్ )** మండలంలో ఎగు శోభ గ్రామపంచాయతీ పరిధి కొత్తవలస గ్రామంలో అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం సుమారు 20. లక్షల రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. మంజూరైన నిధులతో అధికారులు పనులు ప్రారంభించి మధ్యలో నిర్మాణపు పనులు నిలిపివేయడంతో భవనం అసంపూర్తిగా మిగిలిందని స్థానిక గ్రామస్తులు మజ్జి చంచిడి. పాంగి భీమన్న. పాంగి శ్రీను. పాంగి బాబి తదితరులు బుధవారం నాడు తెలిపారు నేటికీ ఐదు సంవత్సరాలు గడుస్తున్న పూర్తి కాలేదని దీంతో అంగన్వాడి కేంద్రానికి వెళ్లే పిల్లలు. మరియుసిబ్బంది. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రస్తుతం అంగన్వాడి కార్యనిర్వహణ కార్యక్రమాలు ఒక ప్రైవేటు భవనంలో నడుస్తున్నాయని ఇప్పటికైనా అధికారులు పిల్లలను దృష్టిలో పెట్టుకొని. భవన నిర్మాణ పనులు పూర్తిచేసి సంబంధిత శాఖ అధికారులకు భవనంఅప్పగించాలని వారు కోరుతున్నారు. భవనం అసంపూర్తిగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని. వీటిని దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించవలసిన బాధ్యత ఎంతైనా ఉందని వారు తెలియజేశారు.

## కొత్తవలస గ్రామంలో మంచినీటి సమస్య



**అనంతగిరి.7 (ప్రజా జ్యోతి న్యూస్ )** మండలంలో ఎగువ శోభ పంచాయతీ పరిధి కొత్తవలస గ్రామానికి నెల రోజులు గా మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వల్ల. స్థానిక ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. మంచినీటి సరఫరా బాధ్యత గ్రామపంచాయతీ శాఖ అధికారులకు ఉన్నప్పటికీ. సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన. నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదని స్థానికుల ఆరోపణ ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకొని నీటి సరఫరా ప్రతిరోజు అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

## తిరుపతి జిల్లా ఎస్. పి ఆధ్వర్యంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి



**మే 7,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** భారత స్వాతంత్ర పోరాట సంగ్రామంలో ఎప్పటికీ ధ్రువతారగా నిలిచిపోయినటువంటి మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అన్నారు బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా తన క్యాంపు కార్యాలయం నందు చిత్రపటానికి పూలమాలవేసి నమస్సుమాంజలి అర్పించినారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశాన్ని, ధర్మాన్ని కాపాడుకునే క్రమంలో సర్వాన్ని త్యాగం చేసిన మహనీయులను గుర్తు చేసుకోవడం ప్రతి భారతీయుని ప్రాథమిక ధర్మమన్నారు. ఆయన నోటి వెంట మాట విన్న అనేక మంది ప్రజలు ఆకర్షితులయ్యారని కొనియాడారు. మన్యం ప్రజల యొక్క దీనస్థితిగతులను చూసి బ్రిటిష్ అధికారుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల కోసం తన ప్రాణాలను అర్పించినటువంటి మహనీయుడు అల్లూరి సీతారామరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు రవీంద్ర రెడ్డి చంద్రశేఖర్ ఆర్మ్ డ్ రిజ ర్వు, ఆర్.ఐ.లు . రాజశేఖర్ రెడ్డి, . రమణ రెడ్డి, శ్రీ.రమణ ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

# అక్రమంగా భూమిని ఆక్రమించుకున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోరా

## రెండు చేతులు జోడిచ్చి అడిగిన ఇక్కడ న్యాయం జరగదా.....

**ప్రజా జ్యోతి రిపోర్టర్ అనంతపురం** గార్లదిన్నె మండలం ఓబులాపురం గ్రామానికి చెందినటువంటి హరిజన వన్నూరప్పకి 7-2 సర్వే నంబర్లో గల 80 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందినటువంటి రఘునాథ్ రెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకొని చీని చెట్లు సాగు చేసుకుంటున్నాడని దీనికొరకు పలుమార్లు గార్లదిన్నె తాసిల్దార్ కార్యాలయంలో అర్జీలు సమర్పించిన ఎన్నోసార్లు కలెక్టరేట్లో అర్జీలు దాఖలు చేసినా ఎటువంటి న్యాయం జరగలేదంటూ హరిజన వన్నూరప్ప మనవడు హరిజన నాగరాజు అదేవిధంగా 2022 వ సంవత్సరంలో గార్లదిన్నె తాసిల్దార్ కార్యాలయం నుండి భూ ఆక్రమణ చట్టము సెక్షన్ 6 ప్రకారం అక్రమంగా సాగు చేసినటువంటి వ్యక్తికి నోటీసులు జారి చేస్తూ 7 రోజులలోపు గార్లదిన్నె పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పంటను మొత్తం తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారు కానీ ఇప్పటివరకు ఎటువంటి తొలగింపు కూడా జరగలేదని తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది పంట సాగు చేయకూడదన్న నోటీసు బోర్డును ఏర్పాటు చేయగా దానిని ధిక్కరించి మరి సాగు చేస్తున్నాడని ఇదంతా అధికారుల కనసందుల్లోనే జరుగుతోందని నా దగ్గర మొత్తం ఆధారాలు ఉన్నాయని ఓబులాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి చెప్పుకొస్తున్నాడు. ఈ విషయం మేరకు భూమిని ఆక్రమించినటువంటి వ్యక్తి కలెక్టరేట్లో అర్జీలు దాఖలు చేయగా దాఖలు చేసిన అర్జీ నీ గాలదిన్నె దాసిల్దార్ కార్యాలయంకు విచారణ నిమిత్తం పంపించగా తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది ఆర్ఐ మరియు విఆర్వోలు నాగరాజు అనే వ్యక్తిని విచారణ జరపకుండానే విచారణ జరిపినట్టు రిపోర్ట్ పంపించారంటూ విచారణ జరపకుండా ఏ విధంగా రిపోర్ట్ పంపిస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈ విషయం నందు అందరూ ఆశ్చర్యపడే విషయం ఏమిటంటే రఘునాథరెడ్డి అనే




వ్యక్తికి హరిజన వన్నూరప్ప అనే వ్యక్తికి ఎటువంటి సంబంధం కూడా లేదు హరిజన వన్నూరప్ప రఘునాథ్ రెడ్డికి ఆ భూమిని అమ్మినట్టు కూడా రఘునాథ్ రెడ్డి దగ్గర ఎటువంటి ఆధారాలు లేవు ఒక దళితుడు మమ్మల్ని ఏం చేస్తాడు అన్న రీతిలో ఆ భూమిని ఆక్రమించారని అంతేకాకుండా అధికారులు కూడా ఒక రకంగా కుల వివక్షత చూపించారని బాధితుడు హరిజన నాగరాజు గట్టిగా ఆరోపిస్తున్నారు. ఇందులో గగ్గురు పరిచే మరొక విషయం ఏమిటంటే హరిజన నాగరాజు చెప్పిన మేరకు రఘునాథ్ రెడ్డి అనే వ్యక్తి నేను ఒక సామాన్యుడనని నాకు ఎటువంటి ఆస్తులు లేవని నేను ఒక పేద కుటుంబీకుడని అందుకోసమే ఆ భూమిని సాగు చేసుకున్నానని ఈ విధంగా రఘునాథ్ రెడ్డి చెప్పుకొస్తున్నాడని అవన్నీ ఒక బూటకపు నాటకాలని రఘునాథ్ రెడ్డికి ఎన్నో ఎకరాల భూమి గాలదిన్నె మండలం నందు కమర్షియల్ బిల్డింగ్ మరియు అనంతపురం పట్టణం నందు ప్లాట్లు కూడా ఉన్నాయని ఈ విధంగా దళితుల భూములను అక్రమంగా ఆక్రమించడం ఎంతవరకు కరెక్ట్ అని మీడియా ముఖంగా అధికారులకు విన్నపించుకున్నారు.

# ప్రజల ఆలోచనలకు అనుగుణంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయి




పాలకొల్లు విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభోత్సవ సభలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ.

**పాలకొల్లు. ప్రజా జ్యోతి. (కొట్టి రామం) మే 7 :** రాష్ట్ర ప్రజలు కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ మంచి ప్రభుత్వాలను ఎన్నుకున్నారని ప్రజల ఆలోచనల కనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. పాలకొల్లు, యలమంచిలి మండలం కొంతేరు లలో బుధవారం మూడు అభివృద్ధి పనులకు జరిగిన శంకుస్థాపన కార్యక్రమాలలోను,పాలకొల్లు రూరల్ నాగరాజు పేటలో రెండు కోట్ల 83 లక్షల వ్యయంతో నిర్మించిన 33 / 11 కెవి విద్యుత్తు ఉపకేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాలలోను పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాజధాని నిర్మాణం అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం మూడు రాజదానుల పేరుతో అమరావతిని మూలన పెట్టిందని అభివృద్ధిని అటకెక్కించిందని అన్నారు. రాష్ట్రంలో దోపిడీ ప్రభుత్వం నడిచిందని ప్రజల సంపద దోచుకున్నారని మంత్రి విమర్శించారు. ప్రధాన మంత్రి మోడీ రాష్ట్రంలో రైల్వే లైన్ లకు ప్రాజెక్టులకు అమరావతి రాజధాని నిర్మాణానికి మూడు లక్షల కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ను అగ్ర రాష్ట్రాలలో ఒకటిగా తీర్చిదిద్దాలని అమరావతిని అత్యున్నతమైన రాజధానిగా చేయాలని చంద్రబాబు లక్ష్యానికి పవన్ కళ్యాణ్ తోడు నిలవగా ప్రధాని మోడీ వారి ఆశయాలను నెరవేర్చే దిశగా సహకరిస్తున్నారన్నారు. మంత్రి రామానాయుడు నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్నారని అటువంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం, ఆయన మంత్రిగా రావటం పాలకొల్లు నియోజకవర్గం ప్రజల అదృష్టమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఐదు సంవత్సరాలు పాటు అభివృద్ధినివిడనాడిందని వైసీపీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నాయకులను ప్రజలను చాలా ఇబ్బందులు గురి చేశారని అన్నారు. ఆ సమయంలో పాలకొల్లుకు రామానాయుడు ఎమ్మెల్యేగా ఉండటం వలన ఆయన మీకు అండగా ఉన్నారన్నారు. ఇటీవల కొందరు కూటమి నాయకుల, కార్యకర్తల కాళ్లు చేతులు నరికేస్తాం అంటూ మాట్లాడుతున్నారని కూటమి నాయకులు కార్యకర్తల వంక చూస్తే కళ్ళు పీకేస్తామని ఆయన హెచ్చరించారు. కూటమి నాయకులకు కార్యకర్తలకు ఎప్పుడు తాము అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం సుస్థిరంగా మరింత ముందుకు సాగుతుందని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అయిన గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆక్వా రైతులు గత ప్రభుత్వం హయాంలో చాలా ఇబ్బందులు గురయ్యారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీ ప్రాంతం ఆక్వా రైతుల గురించి తనకు మంత్రి పదవి ఇచ్చినప్పుడే వివరించి ఆక్వా రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని తెలిపారన్నారు. అక్వా రైతులకు విద్యుత్ యూనిట్ కు రూ.1-50 వంతున సరఫరాకు ఆలోచన చేస్తున్నామని త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకం ప్రారంభిస్తారని అన్నారు. గత ప్రభుత్వంలో కిలోమీటర్ రోడ్డు వేయలేదని, ప్రాజెక్టులు మరమ్మత్తులను చేపట్టలేదని మంత్రి అన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం అని అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే కూటమి ప్రభుత్వం నాగార్జున సాగర్,గుండ్లకమ్మ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇరిగేషన్ మంత్రి రామానాయుడు పోలవరం ప్రాజెక్టు పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. 220 కెవి. విద్యుత్ కేంద్రం నిర్మాణానికి రూ.250 కోట్లు వ్యాయామవుతుందని మంత్రి రామానాయుడు కోరిక మేరకు పాలకొల్లు నియోజకవర్గం లో లో వోల్టేజ్ సమస్య తీర్చడానికి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ గంట పద్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నదని నియోజకవర్గంలో నిరంతర శ్రామికుడిగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న మంత్రి రామానాయుడుని అభినందిస్తున్నానన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు మంతెన రామరాజు మాట్లాడుతూ మంత్రి నిమ్మల రాజకీయాలనుంచి వ ఆయనను పాలకొల్లు నియోజకవర్గం ప్రజలు ఎప్పుడూ వదలరని ఎప్పటికీ వదలరని అన్నారు ఎంత జిల్లా కలెక్టర్ మంత్రి రామానాయుడు పనిచేస్తారని నియోజకవర్గంలో ఆపదలు బట్టలు ఆదుకోవటానికి ఆయన ముందు ఉంటారని అన్నారు జిల్లాలో విద్య ఆరోగ్యము వ్యవసాయం మహిళల ఆర్థిక అభివృద్ధి డిఆర్డిఏ నగ్మా అభివృద్ధికి మంత్రులు ఎమ్మెల్యేలు జిల్లాలో తమకు తోడుగా నిలుస్తున్నారు అని అన్నారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటిస్తే నిలుపుకుంటున్నదని హామీ ఇచ్చిన అభివృద్ధి కార్యక్రమాలని ఒక్కొక్కటిగా చేస్తున్నామని అన్నారు ప్రధానమంత్రి మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విలువలతో కూడిన రాజకీయాలు నడుపుతారని ప్రజాసంపదను కాపాడటానికి సృష్టించడానికి అభివృద్ధిలో నడిపించడానికి ప్రాధాన్యత ఇస్తుంటారని అన్నారు పాలకొల్లు విద్యుత్ గూగుల్ పేజీ సమస్య రాకుండా ఇప్పుడు నిర్మించిన విద్యుత్ చేసిన తో పాటు మరొక 20 30 కే.వి సబ్స్టేషన్ నిర్మించబోతున్నామని పాలకొల్లు నియోజకవర్గం లో తీసుకుంటున్నామన్నారు మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి నియోజకవర్గం జిల్లా నాయకులు టిడిపి నాయకులు కోడి విజయభాస్కర్ పెచ్చుట్టి బాబు 12 విజయ రమణి గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు జనసేన నాయకులు భాను నరసయ్య తుల రామలింగేశ్వరరావు తదితర టిడిపి బిజెపి జనసేన నాయకులు విద్యుత్తు శాఖ అధికారులు కే రఘునాథ్ ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

## వాసవి మాతకు ప్రత్యేక పూజలు

**కంచికచర్ల, మే 07 - ప్రజాజ్యోతి** కంచికచర్ల పట్టణంలో ఆర్యవైశ్యుల ఆరాధ దేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా కంచికచర్ల మండల ఆర్యవైశ్య సంఘం మరియు వాసవి యువసేన ఆధ్వర్యంలో అమ్మవారి జన్మ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి కంచికచర్ల గ్రామంలో 108 కలిశాలతో అమ్మవారి ఊరేగింపు జరిగింది తెల్లవారుజామున మహిళలందరూ దేవాలయానికి చేరుకొని పంచామృతలతో 108 కళాశాలతో అమ్మవారికి అభిషేకాలు జరిగాయి మహిళలందరూ దేవాలయంలో లలితా సహస్రనామం విష్ణు సహస్ర పారాయణం చేశారు జై వాసవి జై జై వాసవి అనే నినాదంతో దేవాలయాన్ని మారుమరోగించారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలందరూ పాల్గొన్నారు.




## శ్రీకాంత్ రెడ్డిని సత్కరించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ సుధా



**బద్వేల్ మే 7 (ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేలు నియోజకవర్గంలోని బి కోడూరు మండలం సిద్దుగారిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి ఇటీవల ప్రకటించబడిన యూపీఎస్సీ ఫలితాలలో 151వ ర్యాంకు సాధించి ఐఏఎస్ గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బద్వేలు పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి. ఎమ్మెల్యే డాక్టర్ సుధా గార్లు ఆయనకు పుష్పగుచ్చం శాలువాతో సత్కారం చేసి అభినందనలు తెలియజేశారు. శ్రీకాంత్ రెడ్డి ఒక చిన్న రైతు కుటుంబానికి చెందినవారు. ఆయన తల్లిదండ్రులు నేలటూరి సుబ్బారెడ్డి %-% సావిత్రి దంపతులు. 1997లో జన్మించిన శ్రీకాంత్ తన విద్యార్హతను కడప, తిరుపతి, నెల్లూరు, ఇండోర్ ప్రాంతాల్లో చదివి, ఐఐటి ఇండోర్ నుంచి బీటెక్ పూర్తి చేశారు. డెలాయిట్ సంస్థలో సాఫ్ట్వేర్ ఇంజినీర్గా పనిచేసిన అనంతరం, ఉద్యోగానికి రాజీనామా చేసి బెంగళూరులో ఐఏఎస్ కోచింగ్ తీసుకున్నారు. మూడవ ప్రయత్నంలోనే విజయవంతమై ఐఏఎస్ గా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, జిల్లా పార్టీ ప్రతినిధి రామసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు కేశవరెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రఘురాం రెడ్డి మరియు శ్రీకాంత్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల భరతం పట్టిన ఇండియన్ ఆర్మీ ధైర్య, సాహసాలకు సెల్యూట్

కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు



**మే 7,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** భారతదేశంలో అశాంతిని, మారణ హోమం సృష్టిస్తూ పాకిస్తాన్ అండతో దేశ సరిహద్దులకు అవతల దాక్కున్న ఉగ్రమూకల స్థావరాలను ఆపరేషన్ సింధూర్ చేపట్టి ధైర్య సాహసాలతో ధ్వంసం చేసిన భారత దేశ సైన్యానికి సెల్యూట్ చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు తెలియజేశారు. ఉగ్రవాదులను అంతంచేడానికి పాకిస్తాన్ లోని 4, పాక్ ఆక్రమిత కాశ్మీర్లో 6 చోట్ల ఉన్న ఉగ్రవాద శిక్షణ శిబిరాలే లక్ష్యంగా భారత సైన్యం చేసిన దాడులు ఉగ్రవాదులకే కాకుండా వారిని ప్రోత్సహిస్తున్న వారి గుండెలను సైతం బద్దలు కొట్టాయన్నారు. మరోసారి భారతదేశంలో దాడులకు పాల్పడాలంటే వెన్నులో వణుకు వచ్చేలా భారత సైన్యం సాహసోపేతంగా చేసిన దాడులు పెహల్గాం మృతుల ఆత్మలనే కాకుండా యావత్ భారత ప్రజల హృదయాలను సంతోషపరిచిందన్నారు. ప్రపంచ దేశాలకు భారతదేశ సైన్యం శక్తిసామర్థ్యాలను తెలియజేసినట్లయ్యిందని పేర్కొన్నారు. పాకిస్తాన్ ప్రజలకు చిన్న దెబ్బ తగలకుండా ఉగ్ర వాదుల స్థావరాలనే లక్ష్యంగా చేసుకొని చేసిన దాడులు యావత్ ప్రపంచాన్ని అబ్బురపరిచాయని తెలిపారు. భారతీయుడిగా తాను ఈ దాడులను సమర్థిస్తూ భారత సైన్యానికి సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచండి.

కమిషనర్ ఎన్.మౌర్య




**మే 7,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి** గంగమ్మ ఆలయ పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గంగ జాతర సందర్భంగా ఆలయంలో భక్తులకు కల్పించిన ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ భక్తులతో మాట్లాడి వారికి కావాల్సిన సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జాతర కు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. క్యూ లైన్ల వద్ద భక్తుల మధ్య తోపులాట జరగకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, ఆలయ ఈ.ఓ. జయకుమార్, ఏసీపీ బాలాజీ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రాజు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు పాల్గొన్నారు.

## నేడే వీర సుంకుల పరమేశ్వర దేవి విగ్రహ ప్రతిష్ట

**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం పరిధిలోని చెన్నంపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వీర సుంకల పరమేశ్వర దేవి విగ్రహ ప్రతిష్ట వేడుకలు గురువారం,ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు బుధవారం, సాయంత్రం విలేకరులకు తెలిపారు. మంగళవారం నుండి బుధవారము గురువారము ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గురువారము ఎనిమిది గంటల నుండి తొమ్మిది గంటల సమయంలో మిధున లగ్న మందు యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ట,గోపుర కలస ప్రతిష్ట కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అందుకు భక్తాతలు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి ఆశీర్వాదం పొందాలని వారు కోరారు.

# గంగమ్మ భక్తులకు మెరుగైన దర్శనం కల్పించడమే మా లక్ష్యం..





**ఆలయప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధిపనులను వెంటనే పూర్తి చేయండి - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు..**

**మే 7,(ప్రజా జ్యోతి)తిరుపతి జిల్లా ప్రతినిధి** తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమయ్యింది. చాటింపు తరువాత బుధవారం భక్తులు భైరాగి వేషంతో అమ్మవారికి మొక్కులను చెల్లించుకున్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గంగమ్మ ఆలయాన్ని సందర్శించి, భక్తులకు అందుతున్న సౌకర్యాలను ఆలయ అధికారులు, ఉత్సవకమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆలయప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధిపనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిభిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భైరాగి వేషం వేసుకున్న పిల్లల కోరిక మేరకు వారితో ఫోటో దిగారు. భక్తులకు మెరుగైన దర్శనం కల్పించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సామాన్యులకు శీఘ్రగతిన దర్శనం కల్పించడంతో పాటు ప్రత్యేక దర్శనం చేసుకునే వారికోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి రోజు పదివేల మంది భక్తులు దర్శించుకున్నారని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. గురువారం బండ వేషంతో అమ్మవారిని భక్తులు మొక్కులు తీర్చుకోనున్నట్లు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నీటికుంటలు ద్వారా బహుళ ప్రయోజనాలు






**భూగర్భ జలాలను పెంపొందించే దిశగా చర్యలు**
**క్షేత్ర స్థాయిలో నీటుకుంటలు త్రవ్వకాల కొరకు పరిశీలన**
**ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి**
**ఏ.పి. ఓ పైల శ్రీనివాస రావు**

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ప్రతీ ఒక్క వర్షపు నీటిని బొట్టుని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నీటి కుంటలు త్రవ్వకాలకు శ్రీకారం చుట్టింది .ఈ సందర్భంగా ఎన్.ఆర్.జి.ఎస్ సిబ్బంది ,హార్టికల్చర్ ,వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నీటికుంటల త్రవ్వకాల కొరకు బుధవారం నాడు పొందూరు మండల కేంద్రంలో పైడికొండ సమీపంలో ఏ .పి. ఓ పైల శ్రీనివాస రావు , ఎంపిడిఓ మీసాల మన్మథ రావు , వ్యవసాయ శాఖ ఏ. ఓ బి బాబ్జీ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ మేరకు భూములను పరిశీలించి అదనంగా 50 పనులను గుర్తించారు. ఈ సందర్భంగా ఏ.పి. ఓ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అన్నదాతల సాగునీటి అవసరాలు తీర్చేందుకు నీటికుంటలు ఉపయోగపడతాయని తెలిపారు. పంట సాగుకు నీటి కొరత లేకుండా ఉండాలనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల నీటి కుంటలు త్రవ్వకాలు మంజూరు కాగా పొందూరు మండలానికి 280 నీటికుంటల త్రవ్వకాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇందులో భాగంగా మండలానికి సంబంధించి 105 మంజూరు కాగా నేడు 50 పనులను అదనంగా గుర్తించడం జరిగిందన్నారు. ఒక్కొక్క నీటి కుంటలు త్రవ్వకానికి ప్రభుత్వం నుండి 55 వేలు వరకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. లేబర్ త్రవ్వకానికి రూ. 35 వేలు , నీటి కుంటలు కూలి పోకుండా రాతి కట్టడాలకు రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. 8 మీటర్లు పొడవు , 8 మీటర్లు వెడల్పు , నాలుగున్నర అడుగుల లోతు కలిగిన నీటికుంటలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షాలు పడినప్పుడు ఆయా నీటి కుంటల్లో లక్ష వరకు నీరు నిల్వ ఉంటుందని తెలిపారు. తద్వారా చుట్టూ ప్రక్కల భూములకు తేమ శాతం పెరుగుతుందని , దీనివలన ఎన్నిక పంట దిగుబడులతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఇవి దోహదం చేస్తాయని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మండలం లక్ష్మింపేట గ్రామం సీతమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ.పథకం టి. ఏ.ఎన్ ఈశ్వర రావు , ఫీల్డ్ అసిస్టెంట్ ఎం రాంబాబు , పైడి కొండ పరిసర ప్రాంత రైతులు పాల్గొన్నారు.

# తప్పుడు విమర్శలు తగదు

**అడుగడుగునా అభివృదికి అడ్డుపడుతున్నారు**
**తప్పుడు పిర్యాదులు,ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదు**
**అభివృద్ధిని అడ్డుకుంటే గ్రామాల్లో తిరగనీయం**
**వైసిపి లోని అంతర్గత విభేదాలను ముందు సరిచేసుకో**
**ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం కోరే నాయకుడు కూన రవికుమార్**
**వైసిపి నాయకులపై మండల టీడిపి నాయకులు ఫైర్**




**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక తప్పుడు విమర్శలు , పిర్యాదులు చేస్తున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్,జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి ,ఏ.ఎం.సి మాజీ ఛైర్మెన్ అన్నెపు రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు మండల కేంద్రం లోని టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కనీసం వార్డు సభ్యుడు గా ఎన్నిక కాలేని వ్యక్తిని నియోజకవర్గం ఇంచార్జి గా నియమించిన పార్టీ వైసీపీ అని ఎద్దేవా చేశారు. పియూసీ ఛైర్మన్ కూన రవికుమార్ ను చర్చకు రావాలని మాట్లాడుతున్న చింతాడకు రవికుమార్ తో చర్చించే స్థాయి ఉందా అని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రశ్నించలేని చింతాడకు అవినీతికి ఆమడదూరం పాటించే రవికుమార్ను విమర్శించే హక్కు లేదన్నారు. ప్రజా శ్రేయస్సు ను పక్కన పెట్టి పార్టీలో జరుగుతున్న అంతర్గత విభేదాల పైన దృష్టి పెట్టిన నాయకులు వైసిపి నాయకులని ముందు పార్టీ లో జరుగుతున్న విభేదాలను సరిచేసుకోవాలని హితవు పలికారు. గ్రామాల్లో విస్తృతంగా జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకున్నా ,అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ పై తప్పుడు విమర్శలు చేసిన చింతాడతో పాటు వైసీపీ నాయకులను గ్రామాల్లో తిరగనీయమని హెచ్చరించారు. ప్రారంభంకాని పథకాలలో అవినీతి జరిగిందని విమర్శించే అవివేకులు వైసిపి నాయకులు అని అన్నారు. ప్రారంభం కాని పథకాల పైన విమర్శలు చేస్తూ అడ్డుపడటం చూసి ప్రజలు నవ్వుతున్నారన్నారు.ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం కోసం కృషి చేసే నాయకుడు ఎమ్మెల్యే కూన రవికుమార్ అని తెలిపారు. ఆయన చేపడుతున్న ప్రతీ ఒక్క అభివృద్ధి పనిలో తప్పుడు ఆరోపణలు చేస్తూ పిర్యాదులు చేస్తూ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు ,పిర్యాదులు చేయడం మానుకోవాలని సూచించారు. లేనియెడల వైసిపి పార్టీ నియోజకవర్గంలో కనుమరుగయ్యే పరిస్థితులు ఏర్పడతాయని , అభివృద్ధిని చూసి ఓర్వలేని నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలెపు శ్రీనివాస రావు, మండల కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## సి.ఎం.ఆర్.ఎఫ్ పేదలకు వరం

**చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ**
**ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి,పొందూరు మండల మాజీ ఎంపీపీ కూన ప్రమీల**



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ( సి.ఎం.ఆర్.ఎఫ్ ) పేదలకు వరమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి,పొందూరు మండల మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. పొందూరు మండలం తం డ్యాం గ్రామానికి చెందిన సబ్బి సత్యన్నారాయణ కుటుంబానికి సి.ఎం.ఆర్ ఎఫ్ విభాగం నుండి రూ. 80 వేలు రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ అనారోగ్యాల కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక చేయూతను అందజేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరూ వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే లక్ష్యం తో ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషి చేస్తున్నారని తెలిపారు. నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. . గత వైసిపి ప్రభుత్వం లో ఐదు సంవత్సరాల వ్యవధిలో ఆమదాలవలస నియోజకవర్గం లో కనీసం 10 లక్షల రూపాయలు కూడా సి.ఎం.ఆర్.ఎఫ్ విభాగం నుండి నిస్సహాయత కుటుంబాలకు ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే సుమారు కోటి రూపాయలు దాటి సి.ఎం.ఆర్.ఎఫ్ విభాగం నుండి బాధిత కుటుంబాలకు చెక్కులు , ఐ. ఓ.సి కు అందించిన ఘనత కూన రవికుమార్ కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.


## వైఎస్ జగన్మోహన్రెడ్డితో భేటీ అయిన నరసాపురం పార్లమెంటు పరిశీలికులు ముదునూరి





**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్... ప్రత్తిపాడు నియోజవర్గం** తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్రెడ్డితో నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు మర్యాద పూర్వక భేటీ అయ్యారు.పార్లమెంటులో ఏడు అసెంబ్లీ నియోజవర్గాల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని,రీజినల్ కో-ఆర్డినేటర్ల సూచనలతో జిల్లా పార్టీ అధ్యక్షులు,నియోజకవర్గం సమన్వయకర్తలతో సమన్వయం చేసికుంటూ నరసాపురం పార్లమెంట్లో పార్టీని ముందుకు నడిపించాలని అలాగే పార్లమెంటులో ఉన్న ఏడు స్థానాల్లో గెలుపులో మీ పాత్ర చాలా కీలకమైందంటూ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్రెడ్డి సూచించారని ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు.ప్రజా సమస్యల మీద నిరంతరం పార్లమెంట్ పరిశీలకులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు,అసెంబ్లీ నియోజవర్గ సమన్వయకర్తలతో, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిపి ప్రజల పక్షాన పోరాడాలని వైయస్ జగన్మోహన్రెడ్డి సూచించారని తెలిపారు.

## ఎన్నికల ముందు హామీలు నిలబెట్టికోండి చిలకమర్తి సాయి ప్రసాద్



**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్.... ప్రత్తిపాడు,** వైసీపీ రాష్ట్ర ఉద్యోగుల సంఘ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని ఇచ్చిన హామీలన్నీ ఎన్నికల తరువాత అధికారం చేపట్టి హామీలు గాల్లోకి వదిలేసిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉద్యోగులు పెన్షనర్ల వింగ్ జాయింట్ సెక్రెటరీ చిలకమర్తి సాయి ప్రసాద్ విమర్శించారు.ఈ మేరకు ఆయన ప్రత్తిపాడులో ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రభుత్వం 30 వేల కోట్లు బకాయిలు ఉండగా 7300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ఆయన అన్నారు.రాష్ట్రం ఆర్థిక పరిస్థితి బాగోలేదని పదే పదే ఈ ప్రభుత్వం చెబుతోంది అన్నారు.సీనియర్ ముఖ్యమంత్రిగా తనకు పరిపాలన అనుభవం అపారంగా ఉందని పదే పదే ప్రచారం చేసుకున్న ఈ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆర్థిక తెలియకుండానే ఓట్ల కోసం ప్రజలతో పాటు ఉద్యోగులను కూడా మోసం చేశారా అని సాయి ప్రసాద్ అన్నారు.సిపిఎస్ ఎప్పుడు రద్దు చేస్తారా అని 3 లక్షల కుటుంబాలు ఎదురు చూస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వం అధికారుల్లో వచ్చాక ఇంతవరకు ఉద్యోగులు ఒక్క రూపాయి ఆర్థిక ప్రయోజనం పొందలేదన్నారు.పెండింగ్లో ఉన్న డిఎ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు.అంగన్వాడి ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ స్కేలు ఇవ్వాలని పిఆర్సి ప్రకటించి ఐ.ఆర్.30 శాతం ప్రకటించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉద్యోగులు పెన్షనర్స్ వింగ్ జాయింట్ సెక్రెటరీ చిలకమర్తి సాయి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## తిరుచానూరులో ఘనంగా వాసవి జయంతి ఉత్సవాలు...



**మే 7,(ప్రజా జ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** వాసవి జయంతిని పురస్కరించుకొని తిరుచానూరులో స్థానికంగా ఉన్న శ్రీ పద్మావతి ఆర్య వైశ్య నిత్య అన్నదాన సేవా సమాజంలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులను ఎన్నుకుని ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మువ్వల నరసింహులు, మాలేపటి నాగరాజు, జీకే, తారక,పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం లో ఎక్కడా లేని విధంగా మహిళా కిరణాలను మొట్ట మొదటగా తిరుచానూరులో ప్రారంభించడం శుభప్రదం అన్ని అన్నారు. ఆర్యవైశ్య సంఘాల కన్నా మిన్నగా స్ఫూర్తిందాయకంగా ఉండాలని సూచించారు. శ్రీ పద్మావతి ఆర్యవైశ్య నిత్య అన్నదాన సేవా సమాజం అధ్యక్షులు టి.సతీష్ కుమార్, రవి చంద్రగుప్త, సతీష్, యువ కిరణాల అధ్యక్షులు కళ్యాణ్, సాయిరాం, అనుదీప్, మహిళా మండలి అధ్యక్షురాలు యం.కుమారి, ఇందిర, సరళకృష, శైలజ, సూర్యప్రభ, స్వర్ణలత, మహిళా కిరణాల అధ్యక్షురాలు రమ్య, అపర్ణ, ప్రతిమ, రెడ్డమ్మ, పావని

## వైసీపీ మైనారిటీ సెల్ సంయుక్తకార్యదర్శిగా షేక్ సహనాజ్ బేగం.

**ఆమెను అభినందించిన డాక్టర్ మొండితోక జగన్మోహనరావు**



**నందిగామ, మే 06 - ప్రజాజ్యోతి** నందిగామ పట్టణం లోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆమె మాజీ శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు గారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతిఒక్కరికి పార్టీ లో తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పునఃనిర్మాణం లో నాయకులు, కార్యకర్తలందరు భాగస్వామ్యం కావాలని కోరారు.అనంతరం సహనాజ్ బేగంకి ఆయన అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమం లో పలువురు జుజ్జురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అమ్మవారిపై భక్తిని చాటుకుంటున్న పట్టణ వాసులు

- పండుగ నిర్వాహణలో పెరుగుతున్న భాగస్వామ్యం
- విస్తృతంగా విరాళాలు అందిస్తున్న దాతలు



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** కోరికలు తీర్చే కల్పవల్లి పొందూరు పైడితల్లి అమ్మవారి పై పట్టణ వాసులు తమ భక్తిని చాటుకుంటున్నారు.మహిమాన్వితమైన తల్లి పైడితల్లమ్మ పండుగలో ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తమ వంతు సహకారంగా చేయూతను అందిస్తున్నారు. ప్రజల నుండి అమ్మవారి పండుగకు విశేషమైన ఆదరణ లభించడం తో పండుగ కమిటీ సభ్యులు మరింత ఉత్సాహంగా విరాళాల సేకరణ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. బుధవారం చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమంలో రిటైర్డు డి.ఎం అండ్ హెచ్. ఓ సనపల తిరుపతి రావు రూ. 30 వేలు , ఏపి. యం గురుగు బెల్లి శ్యామల రావు రూ. 10 వేలు తో పాటు మరి కొంత మంది దాతలు తమ దాతృత్వాన్ని చాటుకుంటూ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , అనకాపల్లి శ్రీనివాస రావు , రైటెర్డ్ ఉపాద్యాయులు కోరుకొండ విజయ్ కుమార్ , గాడు నాగరాజు ,ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్ ,రాయి పిల్లి రాంబాబు , మాసాడ భోగిరాజు,కాలెపు శ్రీనివాస రావు ( కేవిఆర్ ) ,కోరుకొండ రాజశేఖర్ , గుంటుకు రాము , యర్రా సతీష్ కుమార్, అట్ల చంద్ర శేఖర్ , అనకాపల్లి చిన్న , అనకాపల్లి భవాని , ఏ.టి.ఎం , కాకర్ల సాయి , తదితర పండుగ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు అక్రమిస్తే చర్యలుతీసుకుంటాం తహసిల్దార్ భారతి



**తూ.గో. జిల్లా, తాళ్లపూడిమండలం,మే7, ప్రజాజ్యోతి న్యూస్ :** తాళ్లపూడి మండలం తిరుగుడు మెట్ట గ్రామంలో సుబ్బరాజు చెరువు ఆక్రమణకు గురైందని గ్రామ నివాసి రెబ్బా ప్రగడ సాయి కృష్ణ ఫిర్యాదు చేయగా, బుధవారం పంచాయతీ మరియు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి స్వాధీన పరుచుకున్నట్లు మండల తాసిల్దార్ మోహన భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

## అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు పై అవగహన నందిగామలో సివిల్ మోక్ డ్రిల్ల్



**నందిగామ మే 06 - ప్రజాజ్యోతి** నందిగామ పట్టణంలో గాంధీ సెంటర్ నందు సాయంత్రం 5 గంటలకు నందిగామ రెవిన్యూ డివిజనల్ అధికారి కే బాలకృష్ణ అధ్యక్షతన ఫైర్ సిబ్బందితో విప్పత్తుల సమయంలో తీసుకొనవలసిన జాగ్రతల గురించి మోక్ డ్రిల్ల్ నిర్వహించడం జరిగింది ఈ మోక్ డ్రిల్ల్ నందు ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలు, వరదలు మరియు ఇతర విపత్తుల సమయలో ప్రజలు ముందుగా తీసుకొనవలసిన జాగ్రతల గురించి తెలియజేసారు.అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు- చర్యల గురించి తెలియజేసారు.అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 కి సమాచారం అందించాలని తెలియజేసారు.వరదల సమయంలో ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరియు ప్రమాదం జరిగితే ముందుగా పాటించవలసిన చర్యల గురించి తెలియజేయండమైనది.విపత్తుల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఫైర్ ఆఫీసర్, నందిగామ తహసీల్దార్, నందిగామ మున్సిపల్ కమీషనర్, ఎంపీడీఓ నందిగామ, సిబ్బంది మరియు ప్రజలు పాల్గొన్నారు.

# జొన్నగిరి గ్రామంలో మాక్ డ్రిల్ ప్రోగ్రాం నిర్వహించిన తాసిల్దార్ రమాదేవి

**ఎంపీడీవో విశ్వమోహన్...**
**జొన్నగిరి ఎస్సై ఎన్ సి మల్లికార్జున**



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో మాక్ డ్రిల్ ప్రోగ్రాం నిర్వహించారు, తాసిల్దార్ రమాదేవి,జొన్నగిరి గ్రామ ప్రజలకు మాక్ డ్రిల్, గురించి వివరించారు, మే7న దేశంలోని 244 జిల్లాల్లో మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర హెూం శాఖ అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. పాకిస్థాన్ తో యుద్ధం జరగనున్న నేపథ్యంలోనే కేంద్రం ఈ చర్యలు తీసుకుంటోందని ఇప్పటికే కేంద్ర సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. 1971లో భారత్ - పాకిస్థాన్ యుద్ధం సమయంలో ఈ మాక్ డ్రిల్స్ నిర్వహించింది, అప్పటి భారత ప్రభుత్వం. మళ్లీ 54 సంవత్సరాల తర్వాత సివిల్ డిఫెన్స్ ,మాక్ డ్రిల్స్ నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో అక్కడక్కడ, మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు, జొన్నగిరి ఎస్ఐ ఎన్ సీ మల్లికార్జున,మాట్లాడుతూ భారత్ - పాక్ ల మధ్య యుద్ధం అనివార్యమైతే.. వైమానిక దాడుల ముప్పు ఉన్నప్పుడు పెద్ద శబ్దంతో కూడిన సైరన్లను మోగిస్తారు. ఆ సమయంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు, బంకర్లకు లేదా ఇతర సేఫ్ ప్రదేశాలకు తరలి వెళ్లాల్సి ఉంటుంది. లైట్లను ఆపి శత్రు విమానాలకు గమ్యం కాకుండా చూడాలి. సివిలియన్ అండ్ స్టూడెంట్స్ కు యుద్ధ సమయంలో ఏం చేయాలన్న విషయాలపై మాక్ డ్రిల్స్ లో ట్రైనింగ్ ఇస్తారు. స్కూళ్లు, కాలనీలు, కార్యాలయాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అన్నారు,ఎంపీడీవో విశ్వమోహన్ మాట్లాడుతూ,అత్యవసర సమయంలో ఎలా స్పందించాలి,సురక్షిత ప్రదేశాలు ఎక్కడ ఉన్నాయి,స్నేహితులు, కుటుంబాలను ఎలా రక్షించుకోవాలి, వాళ్లను ఎలా చేరుకోవాలి, ప్రభుత్వ కార్యాలయాలు, పవర్ ప్లాంట్లు, కమ్యూనికేషన్ టవర్లు, ప్రాముఖ్యమైన ప్రదేశాలను కవర్ చేయడం, ఇవాక్యుయేషన్ ప్లాన్ అప్డేట్స్ అండ్ రిహార్సల్స్, దాడి సమయంలో ఎటువైపు వెళ్లాలన్న విషయాలపై మాక్ డ్రిల్స్ లో అవగాహన కల్పిస్తారు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్‌లో మే 4న 30 నిమిషాల బ్లాక్‌అవుట్ డ్రిల్ జరిగింది. ఇది రేపు దేశవ్యాప్తంగా జరిగే కవాతుకు ఒక సంకేతం. ఈ డ్రిల్స్‌లో సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, హెూం గార్డ్స్, సభ్యులు, విద్యార్థులు, స్థానిక అధికారులు పాల్గొంటారు. ఈ కవాతు భారతదేశం యొక్క రక్షణ విధానంలో పౌర సన్నద్ధతను చేర్చే ఒక వ్యూహాత్మక మార్పును సూచిస్తుంది. ఈ డ్రిల్స్ వల్ల పౌరులు భయపడాల్సిన అవసరం లేదని, యుద్ధం వస్తే ఎలా ఎదుర్కోవాలో అందరికీ అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే నిర్వహిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు,భవిష్యత్తుకోసం ఉపయోగపడుతుంది. ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రమాదేవి, డిప్యూటీ తాసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో విశ్వ మోహన్ ,జొన్నగిరి ఎస్సై ఎన్,సీ మల్లికార్జున, పత్తికొండ ఫైర్ ఆఫీసర్ మరియు గ్రామ సర్పంచ్, గ్రామపంచాయతీ సెక్రెటరీ, సచివాలయం ఉద్యోగులు పాల్గొనడం జరిగింది,

# దాదాపు 100 మందికి బీజేపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు





**బీజేపీ ఎమ్మెల్యే పార్థ సారథి**

**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలంలోని రాంపల్లి గ్రామంలో తుగ్గలి మండల బీజేపీ కన్వీనర్ లక్ష్మన్న,సురేంద్ర,జి లక్ష్మణ్ స్వామి ఆద్వర్యంలో ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థ సారథి ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే పార్థ సారథి రాంపల్లి గ్రామస్తులను 30 కుటుంబాల సభ్యులలో దాదాపు 100 మందికి బీజేపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆదోని ఎమ్మెల్యే పార్థ సారథి మాట్లాడుతూ మన దేశంలో అత్యంత కీలకమైన జాతీయ పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలియజేస్తూ భారత దేశపు ప్రధాన మంత్రి నరేంద్ర మోది నాయకత్వంలో దేశ ప్రజలకు మంచి పరిపాలన అందిస్తున్న ఏకైక భారత ప్రధాని నరేంద్ర మోడీ అని,ప్రస్తుత పరిస్థితుల్లో కాశ్మీర్ లో జరిగిన ఉగ్ర వాదులు చేపట్టిన అసాంఘిక శక్తులైన ఉగ్ర మూకలు దాడి చేసి చంపడంతో దానికి ప్రతి దాడి చర్యలతో ఆపరేషన్ సింధు అని పేరుతో భారత సైనికులైన భారత మహిళలను పాకిస్తాన్ ఉగ్ర షీభిరాలపై దాడి చేయడంతో ఉగ్ర మూకలు 100 మందిని చంపడం హర్షించదగ్గ విషయం అని తెలియజేస్తూ భారతీయ జనతా పార్టీలో చేరిన రాంపల్లి గ్రామస్తులకు పార్టీలో చేరిన భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు అండ దండలుగా ఉంటామని తెలియజేశారు.అనంతరం రాంపల్లి గ్రామ బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే పార్థ సారథిని గజమాల వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పత్తికొండ ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ బీజేపీ పార్టీలో చేరిన ముఖ్య నాయకులు రంగయ్య,రవిరెడ్డి,వెంకటేష్ రెడ్డి,హరి,ఓబులేషు వారి కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదులు దాడుల సమయంలో పౌరులు స్వీయ రక్షణపై అవగాహన





**ఆమదాలవలస రైల్వే స్టేషను లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించిన జిల్లా పోలీసులు**

**శ్రీకాకుళం ,ప్రజా జ్యోతి న్యూస్:** ఉగ్రవాదులు దాడులు జరిగినప్పుడు సమీపాన పౌరులు తమకు తాము ఏ విధంగా స్వీయ రక్షణ పొందాలి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి, రక్షణ దళాలు ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై శ్రీకాకుళం జిల్లా పోలీసులు బుధవారం శ్రీకాకుళం రోడ్డు ఆముదాలవలస రైల్వే స్టేషన్లో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు.కేంద్ర హెూంశాఖ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ,జిల్లా ఎస్పి కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు,రెవిన్యూ, అగ్ని మాపక, హెల్త్, రైల్వే, జి.అర్.పీ,ఐసీడీఎస్,ఇతర శాఖలు సమన్వయం తో ఈ సివిల్ మాక్ డ్రిల్ ను నిర్వహించి ప్రయాణికులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.రైల్వే స్టేషను, ఇతర పబ్లిక్ ప్రదేశాలలో ఉగ్రవాద దాడులు వేళ అత్యవసర, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, పౌరులు వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలు,సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలి, అనే విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. ఉగ్రవాదులు దాడులుకు పాల్పడితే ఆ సమయంలో ఎలాంటి భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలి, ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పించాలి ప్రమాదం జరిగిన వెంటనే వారిని ఆంబులెన్స్ ద్వారా హాస్పిటల్ కు ఎలా తరలించాలి , బాంబులు అమర్చిన ప్రాంతాన్ని బాంబు స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలి,ఉగ్రవాదులను, శత్రువు ముకలని ఏ విధంగా హతమార్చాలని అంశాలను సివిల్ మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సివిల్ మాక్ డ్రిల్ కార్యక్రమం లో శ్రీకాకుళం అర్.డి.ఓ సాయి ప్రత్యూష, డీఎస్పీలు వివేకానంద , శేషాద్రి, జిల్లా అగ్నిమాపక అధికారి జె.విజయకుమార్, ఎస్బి సిఐ ఇమ్మన్యుల్ రాజు, ఆమదాలవలస సీఐ సత్య నారాయణ,ఎస్ఐలు అన్ని శాఖల అధికారులు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అల్లూరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి..

**బాపట్ల, మే 7 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహనీయుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి వారిని స్మరించుకున్నారు. అల్లూరి సీతారామరాజు 1897 లో విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించి, పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో నివాసం ఉన్నారని, అల్లూరి సీతారామరాజు భారతదేశంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా, మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటాన్ని సాగించిన భారతీయ విప్లవకారుడని ఎస్పీ పేర్కొన్నారు. అతని వీరోచిత సాహసకృత్యాలకు స్థానిక ప్రజలు అతనికి మన్యం వీరుడు, అగ్గి పిడుగు అనే బిరుదులను ఇచ్చారన్నారు. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు 1924 మే 7న శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారని తెలిపారు. నేడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆ మహావీరుడిని ఒకసారి స్మరించుకోవడం ఎంతో గర్వంగా వున్నదన్నారు. గొప్ప వ్యక్తుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి యువత నాయకత్వ లక్షణాలను మెరుగు పరుచుకొని సమాజంలో జరిగే అన్యాయాలను ఎదిరించి మంచివైపు నిలబడాలన్నారు. సమాజంలో జరుగుతున్న నేరాలను అదుపు చేయడానికి పోలీస్ వారికి సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి విఠలేశ్వర్, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## మన్యం వీరుడికి ఘన నివాళి..

**బాపట్ల, మే 7 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** అల్లూరి సీతారామరాజు101 వర్ధంతి క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యం లో సూర్యలంక రోడ్ లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి శాసనసభ్యులు బుధవారం వేగేశన నరేంద్ర వర్మ రాజు పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు భారతదేశంలో బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా మన్యం ప్రజల హక్కుల కోసం సాయుధ పోరాటాన్ని సాగించిన భారతీయ విప్లవకారుడు అని, అతని విరోచత సాహస కృత్యాలకు ప్రజలు అతనికి మన్యం వీరుడు, అగ్గి పిడుగు బిరుదులు అందించారన్నారు. రెండేళ్లపాటు బ్రిటిష్ వాళ్లకు కంటిమీద నిద్ర లేకుండా చేసిన మన్యం వీరుడు. సీతారామరాజు1924 మే7న శాశ్వత నిద్రలోకి జారుకున్నారని పేర్కొన్నారు. వర్ధంతి కార్యక్రమంలో ఎమ్. అనంత వర్మ రాజు, సలగల రాజశేఖర్ బాబు, శ్రీమన్నారాయణ, గంట అంజిబాబు, పఠాన్ రాజేష్, బిజెపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు మంతెన ఆనంద గజపతిరాజు, ఉపాధ్యక్షులు పెను మోచ్చ నటరాజు, కార్యదర్శి కె. భాస్కర రాజు, చంపాటి జయ నాగరాజు, ఎం. విష్ణువర్ధన్ రాజు, కనకరాజు, హరే రామరాజు, శ్రీనివాసరాజు, రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి..

మంత్రి కోలుసు పార్థసారథి..

బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన మంత్రి,ఎమ్మెల్యే




**బాపట్ల, మే 7 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ప్రజల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఇంఛార్జి మంత్రి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన నగదును బాధిత కుటుంబాలకు పర్చూరు శాసనసభ్యులు క్యాంపు కార్యాలయంలో బుధవారం చెక్కుల రూపంలో జిల్లా ఇంఛార్జి మంత్రి పార్థసారథి, శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా అందజేశారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని జిల్లా ఇంఛార్జి మంత్రి పార్థసారథి అన్నారు. పర్చూరు నియోజకవర్గంలోని అనారోగ్యానికి గురైన 43 మంది బాధితులు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావును కలిసి అభ్యర్థించారన్నారు. పర్చూరు శాసనసభ్యుల సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తక్షణమే సీఎం సహాయ నిధి నుంచి 28.85 లక్షల నిధులను విడుదల చేశారన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారంతా వెంటనే కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. వారి కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

## నార్త్‌లో పలు విమానశ్రయాలు మూసివేత

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ కు శ్రీకారం చుట్టాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 9 ఉగ్రవాద స్థావరాలను విజయవంతంగా ధ్వంసం చేసింది. ఈ క్రమంలో పాకిస్తాన్, భారత్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలతో బుధవారం ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలలోని విమానాశ్రయాలు మూసివేయనున్నారు. ఈ మేరకు విమాన ప్రయాణికులకు ఎయిర్ లైన్స్ సంస్థలు సూచనలు చేస్తున్నాయి.ధర్మశాలతో పాటు లేహ్, జమ్మూ, శ్రీనగర్, అమృత్‌సర్‌తో సహా పలు విమానాశ్రయాలు తదుపరి నోటీసు వచ్చే వరకు మూసివేసి ఉంటాయని స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఒక పోస్ట్‌లో తెలిపింది. ఈ సమయంలో రాకపోకలు చేసేవారు ఈ విషయాన్ని గమనించాలని సూచించింది. పలు విమానయాన సంస్థలు ఇదివరకే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణీకులు ప్రస్తుత పరిణామాలు గమనించి ప్రయాణాన్ని తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని చెబుతున్నాయి.భారత బలగాల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తరువాత కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ధర్మశాల , లేహ్, జమ్మూ , శ్రీనగర్, అమృత్‌సర్ సహా ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలోని విమానాశ్రయాలు తాత్కాలికంగా మూసివేశారు. తదుపరి నోటీసు వచ్చే వరకు అవి సేవలు అందించవని అధికారులు స్పష్టం చేశారు. వీటి కారణంగా ప్రస్తుత రాకపోకలకు టికెట్లు బుక్ చేసుకున్న వారి జర్నీ ప్రభావితం కావచ్చు. ప్రయాణీకులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోవడమే, లేక ప్రత్యామ్నాయం ప్లాన్ చేసుకోవాలని ఎయిర్ లైన్స్ సంస్థల ప్రతినిధులు సూచించారు. దేశంలోని ఎంపిక చేసిన నగరాలకు, అక్కడి నుండి బయలుదేరే ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణికులకు విమాన ప్రయాణానికి సంబంధించి అడ్వైజరీ జారీ చేసింది. శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాలకు వెళ్లేవారు, అక్కడి నుండి బయలుదేరే విమాన సేవలు అందుబాటులో లేవని ఎక్స్ ఖాతాలో తెలిపింది. విమానాశ్రయానికి చేరుకునే ప్రస్తుత స్థితిని తనిఖీ చేసుకోవాలని విమానయాన సంస్థలు తమ ప్రయాణికులను కోరాయి."మారుతున్న పరిస్థితుల కారణంగా శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాలకు వెళ్లేవారు.. అక్కడి నుంచి బయలుదేరే మా విమానాలు ప్రభావితం అయ్యాయి. ఈ ఎయిర్ పోర్టులు మూసివేడంతో ప్రస్తుతం విమాన ప్రయాణాలు సాధ్యం కాదని, దయచేసి ఈ విషయాన్ని గమనించాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము" అని ఇండిగో పోస్ట్ చేసింది. గగనతల పరిమితుల వల్ల బికనీర్‌కు వెళ్లే, అక్కడి నుండి బయలుదేరే విమానాలు సైతం అందుబాటులో లేవు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి అర్థం చేసుకోవాలని సూచించారు.పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై "ఆపరేషన్ సిందూర్"లో భాగంగా ఈ దాడులు చేసింది భారత సైన్యం. విజయవంతగా భారత బలగాలు తమ టార్గెట్ పూర్తి చేశాయని, ఎలాంటి సైనిక స్థావరాల జోలికి వెళ్లలేదని భారత రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. అందుకు ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ కు శ్రీకారం చుట్టి తమ సత్తా చాటింది.

## భారత్ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది- అసదుద్దీన్

**హైదరాబాద్ :** పహల్గాంలో జరిగిన ఉగ్రదాడులకు భారత ప్రభుత్వం ఏం చేస్తుందా అని ఎదురుచూసిన వారికి సమాధానం దొరికింది. గతంలో పుల్వామా ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. రాత్రికి రాత్రే వెళ్లి పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద స్థావరాలపై మెరుపు దాడులు చేసి ఊహించని విధ్వంసాన్ని వారికి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. ఏప్రిల్ 22న పహల్గాంలో మరో భారీ ఉగ్రదాడి జరగగా, అందుకు ప్రతీకారంగా భారత బలగాలు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించాయి. 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి నామరూపాలు లేకుండా చేసి భారత బలగాలు విజయవంతంగా తిరిగొచ్చాయని రక్షణ శాఖ తెలిపింది. భారత బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పై నేతలు ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

# బాపట్ల జిల్లాలో "మాక్ డ్రిల్"

మాక్ డ్రిల్ నిర్వహణ పై జిల్లా అధికారులకు,జిల్లా కలెక్టర్ వెంకట మురళి ,జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచనలు..

విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ఎటువంటి విపత్కర పరిస్థితులలో నైనా ప్రజలకు అండగా జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉంది..

జిల్లా ఎస్పీ తుషార్ డూడి..






**బాపట్ల, మార్చి 7 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** భారత్ పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్నందున సంక్షోభ సమయంలో పౌరులు తమను తాము ఏవిధంగా కాపాడుకోవాలో అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ వెంకట మురళి,జిల్లా ఎస్పీ తుషార్ డూడి లు సూర్యలంకలో జిల్లా అధికారులకు మాక్ డ్రిల్ నిర్వహణ పై దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ సారథ్యంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సిబ్బంది సంయుక్తంగా బాపట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ లో మాక్ డ్రిల్ నిర్వహించారు.మాక్ డ్రిల్ లో భాగంగా రైల్వే స్టేషన్ లో అగంతకులు దాడులకు పాల్పడుతున్నారనే సమాచారంతో పోలీస్ యంత్రాంగం ఇతర శాఖల అధికారులు సిబ్బంది రైల్వే స్టేషన్ కు చేరుకొని తనిఖీలు నిర్వహించారు. ఆగంతుకుల దాడులలో గాయపడిన వారికి ప్రధమ చికిత్స అందించి అంబులెన్స్ లో వైద్యశాలకు తరలించారు. దాడులు జరిగే సమయంలో ప్రయాణికులను అప్రమత్తం చేసి సురక్షితమైన ప్రదేశాలకు తరలించారు. దాడులు జరిగే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించే విధానం పై ప్రయాణికులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం భరత్ పాక్ ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితులలో శత్రుదేశాల ఆగంతకులు దాడులకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా అనుకోని ప్రదేశంలో ఆగంతకులు దాడులకు పాల్పడితే జిల్లాలోని అన్ని శాఖలు సంయుక్తంగా విధులు నిర్వహించి ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరుగకుండా తీసుకోవలసిన చర్యల గురించి, విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు ఏవిధంగా అప్రమత్తంగా వ్యవహరించాలి అనే విషయాల గురించి పౌరులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లాలోని బాపట్ల రైల్వే స్టేషన్ లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. బుధవారం ఉదయం 7:30 గంటల సమయంలో సూర్యలంకలో జిల్లా అధికారులకు మాక్ డ్రిల్ నిర్వహణ పై తగిన సూచనలు ఇచ్చారు. 11:00 గంటలకు అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ ఆధ్వర్యంలో బాపట్ల రైల్వే స్టేషన్ లో జిల్లా అధికారులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ రైల్వే స్టేషన్ లో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. రైల్వే స్టేషన్ లో ఇద్దరు అగంతకులు దాడులకు పాల్పడుతున్నారని రాబడిన సమాచారం మేరకు పోలీస్, ఫైర్, రైల్వే, రెవెన్యూ, వైద్య, ఇతర శాఖల అధికారులు సిబ్బంది సంయుక్తంగా పదినిమిషాల వ్యవధిలోనే రైల్వే స్టేషన్ కు చేరుకుని తనిఖీలు చేయడం జరిగిందన్నారు. రైల్వే స్టేషన్ లో ఉన్న ప్రయాణికులను సురక్షితమైన ప్రదేశానికి తరలించడం జరిగిందన్నారు. గాయపడిన వారికి వైద్యుల సహాయంతో ప్రథమ చికిత్స అందించి హాస్పటల్ కు తరలించడం జరిగిందన్నారు. ఏదైనా అనుకోని విపత్తు వస్తే అన్ని శాఖలు కలిసికట్టుగా ఏ విధంగా విధులు నిర్వహించాలి అనే దానిని దృష్టిలో ఉంచుకొని మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. ఏదైనా అనుకోని విపత్తు ఎదురైనప్పుడు ప్రజలు అధైర్య పడవద్దని ప్రజలకు సహాయం అందించడానికి జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, డిఎస్ఓ విలియం, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, ఆర్డీవో గ్లోరియా, బాపట్ల పట్టణ ఇన్స్పెక్టర్ రాంబాబు, రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆర్.ఐ లు మౌలుద్దీన్, శ్రీకాంత్, రైల్వే, వైద్య, అగ్నిమాపక ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిండు గర్భిణిని అతి కిరాతకంగా హత్య చేసిన నిందితురాలికి జీవిత ఖైదు




**బాపట్ల మే 7 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** నేరం చేసిన నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. బల్లికురవ పోలీస్ స్టేషన్ పరిధిలో వి.కొప్పెరపాడు గ్రామంలో గర్భిణి స్త్రీ నీళ్లు తీసుకురమ్మని అడిగినందుకు అతి కిరాతకంగా కొట్టి కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేసిన కేసులు నిందితురాలికి ఒంగోలు %ఎ××్ష్ర% అడిషనల్ డిస్టిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బుధవారం జీవిత ఖైదు విధిస్తు తీర్పువెలువరించారు. వివరాలలోకి వెళితే బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు గ్రామానికి చెందిన సురభి సారమ్మ (20 సం//) కు సురభి చార్లెస్ తో 2014 వ సంవత్సరంలో వివాహమైంది. గర్భవతి అయిన సారమ్మ 2015 సెప్టెంబర్ 13 న సాయంత్రం సుమారు 6.00 గంటల సమయంలో ఆమె భర్త చార్లెస్ ను నీళ్లు తెమ్మని అడగగా, మగాడిని నీళ్లు అడిగేది ఏంటి అని ఆమె భర్త చార్లెస్, అత్తామామలు సురభి ఏసమ్మ, సురభి పున్నయ్య, ఆడబిడ్డ సురభి లింగమ్మ లు గొడవ పెట్టుకొని అతి కిరాతకంగా కర్రతో కొట్టి కిరోసిన్ ఒంటిపై పోసి నిప్పు పెట్టినారు. శారమ్మ ఒళ్ళు కాలి మంటలు వారి పూరింటికి అంటుకొని ఇల్లు కాలిపోతుండగా, శారమ్మ శరీరంపై మంటలతో ఇంటి బయటకు వచ్చి నీళ్ళ తోట్టెలో కూర్చుని మంటలు అరుపుకొంది. గ్రామంలోని చుట్టుపక్కల వారి ద్వారా శారమ్మ అన్న, వదిన బంధువులు విషయం తెలుసుకొని వచ్చి శారమ్మను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకొని వెళ్ళి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కొరకు ఒంగోల్ రిమ్స్ ఆసుపత్రికి తరలించినారు. చికిత్స పొందుతూ 2015 సెప్టెంబర్ 18న చనిపోయినది. అప్పటి అద్దంకి సిఐ బేతపూడి ప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టి, 4 గురు ముద్దాయిలను అరెస్ట్ చిసినారు. తదుపరి దర్యాప్తు నిర్వహించిన రాఘవేంద్రరావు కేసు దర్యాప్తు పూర్తి చేసి 4 గురు ముద్దాయిలపై చార్జ్ షీట్ ఫైల్ చేసినారు. ఒంగోలు 7వ అడిషనల్ డిస్టిక్ట్ అండ్ సెషన్స్ కోర్ట్ లో కేసు విచారణకు రాగ, బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపిఎస్ ఆదేశాల మేరకు, బాపట్ల డిఎస్పీ రామాంజినేయులు పర్యవేక్షణలో, సంతమాగులూరు సీఐ వెంకట రావు ఒంగోలు జిల్లా కోర్ట్ లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, బల్లికురవ కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస రావు లు సాక్షులు సరైన రీతిలో, నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చి, సరైన సమయంలో కోర్టుకు హాజరు పరచగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంత కుమారి కోర్టులో వాదోపవాదాలు వినిపించి నిందితులపై మోపబడిన నేరాన్ని తగిన సాక్షాదారాలతో నిరూపించగా, ఒంగోలు 7వ అడిషనల్ అండ్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి టి.రాజా వెంకటాద్రి మృతురాలిని అతికిరాతకంగా హత్య చేసిన సురభి లింగమ్మ (24//) ను హత్యానేరం క్రింద జీవిత ఖైదు, మృతురాలిని వేదింపలకు గురిచేసిన నేరానికి 2 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష రూ. 1000/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. శారమ్మ అత్త మామలు కేసు విచారణ సమయంలో చనిపోయినారు. శారమ్మ భర్త కోర్ట్ నుండి బెయిల్ పై వచ్చి కనిపించకుండా పారిపోయినాడు. ఈ కేసులో నిందితురాలికి శిక్షపడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి పోలిస్ అధికారులను, సాక్షులు నిర్భయంగా సాక్ష్యం చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చిన సంతమాగులూరు సీఐ వెంకట రావు, కోర్టు లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులు , బల్లికురవ కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస రావు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంత కుమారి లను జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. నేరం చేసిన వారికి న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరిగినట్లు అవుతుందని, ఇటువంటి తీర్పులు వెలువడినప్పుడు నేరస్థులలో భయం అనేది ఏర్పడుతుందని ఎస్పీ తెలిపారు. త్వరలో పరారీలో ఉన్న ప్రధాన ముద్దాయి సురభి చార్లెస్ ఆచూకీ కనుగొని అతనికి కఠినమైన శిక్ష విధించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# చర్మంపై ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా?



మన శరీరంలో కాలేయం ఒక ముఖ్యమైన అవయవం. శరీరం నుండి ఆహారం, నీరు, విషాన్ని ఫిల్టర్ చేయడానికి కాలేయం పనిచేస్తుంది. కాలేయానికి హాని కలిగించే పదార్థాలను తినడం, త్రాగడం వల్ల కాలేయం పనితీరుపై ప్రభావం చూపుతుంది. దీని ప్రభావం మొత్తం శరీరంపై కనిపిస్తుంది. ముఖ్యంగా చర్మంపై ప్రభావం కనిపిస్తుంది.. చర్మంపై సాలెగూడు లాంటి దురద దద్దుర్లు కనిపిస్తాయి. కాలేయాన్ని సురక్షితంగా ఉంచడానికి నిపుణులు ఏం చెబుతున్నారు. కాలేయం మన మొత్తం శరీరాన్ని జాగ్రత్తగా చూసుకుంటుంది. కాలేయంలో ఏదైనా ఇన్ఫెక్షన్ ఉంటే, దాని ప్రభావం మొత్తం శరీరంపై కనిపిస్తుంది. కొన్నిసార్లు ఈ ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. లివర్ ఇన్ఫెక్షన్ చర్మంపై కూడా చాలా చెడు ప్రభావాన్ని చూపుతుంది. కాలేయ సంక్రమణ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సను పొందాలి.. కాలేయ ఇన్ఫెక్షన్ పెరిగితే, అనేక తీవ్రమైన వ్యాధులు మిమ్మల్ని చుట్టుముట్టవచ్చు. కాలేయంలో ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు, చర్మంపై కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను తేలికగా తీసుకోకూడదంటున్నారు వైద్య నిపుణులు.. కాలేయంలో ఇన్ఫెక్షన్ ఉంటే చర్మంపై ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి. కాలేయంలో ఇన్ఫెక్షన్ ఉంటే, అనేక చర్మ సంబంధిత వ్యాధులు వస్తాయి. చర్మంపై ఎర్రటి దద్దుర్లు రావడంతో పాటు, అవి దురదను కూడా కలిగిస్తాయి. శరీరంలో ఎక్కడైనా దురద ఎక్కువసేపు కొనసాగితే, కాలేయాన్ని ఖచ్చితంగా తనిఖీ చేయాలి. చర్మం దురదను ఎక్కువసేపు నిర్లక్ష్యం చేస్తే, అది తీవ్రమైన కాలేయ వ్యాధికి దారితీస్తుంది. దీనితో పాటు, కామెర్లు కూడా సంభవించవచ్చు. కాలేయ ఇన్ఫెక్షన్ కారణంగా కూడా అనేక ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయి. వీటిలో హెపటైటిస్ – లివర్ సోరియాసిస్ కూడా ఉన్నాయి. కాలేయం ఒకే సమయంలో బహుళ పాత్రలను పోషిస్తుంది. ఆహారం, నీరు, విష పదార్థాలను ఫిల్టర్ చేసి తొలగించడానికి ప్రత్యేకంగా పనిచేస్తుంది. ఈ విధుల్లో ఏదైనా ఆటంకం ఏర్పడితే, దాని ప్రభావాలు చర్మంపై కనిపించడం ప్రారంభిస్తాయి. కాలేయ పనితీరు తగ్గినప్పుడు, చర్మంపై దురదతో కూడిన దద్దుర్లు కనిపిస్తాయి. దీనితో పాటు, చర్మంపై పాచెస్ లాగా కనిపించే దద్దుర్లు కూడా ఉంటాయి. ఇది శరీరంలో ఎక్కడైనా జరగవచ్చు. ఇవి నిరంతరం దురదకు కారణమవుతాయి. ఈ మొటిమలను గీకడం ద్వారా, అవి పెరిగి పెద్ద ప్రదేశంలో వ్యాపిస్తాయి. ఈ వ్యాధి కాలేయం పనితీరు తగ్గడం వల్ల వస్తుంది. కాలేయానికి చికిత్స చేయకపోతే ఈ వ్యాధి పూర్తిగా తగ్గదు. చర్మంపై అలెర్జీ లేదా దురద దద్దుర్లు ఉంటే, వాటికి చికిత్స చేయించుకోవడంతో పాటు, మీ కాలేయాన్ని కూడా తనిఖీ చేయించుకోండి. దీనితో పాటు, మీ దినచర్య, ఆహారాన్ని మార్చుకోండి. మీ ఆహారంలో వేయించిన, కారంగా ఉండే ఆహారాన్ని నివారించండి. మద్యం, పొగాకు సేవించడం మానేయండి. దీనితో పాటు, కాకరకాయ, లీక్స్, జిన్సెంగ్, పుదీనా, మొక్కజొన్న, కూరగాయలు లాంటివి ఆహారంలో చేర్చుకోండి. దీనితో పాటు, శరరీరాన్ని డీహైడ్రేషన్ బారిన పడనివ్వకండి.. తగినంత నీరు త్రాగుతూ ఉండండి. దీనితో పాటు, మీ దినచర్యను క్రమబద్ధీకరించుకోండి.. వ్యాయామం చేయండి.

# తల్లి పాలల్లో అద్భుత ఔషధ గుణాలు



ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ టీవీ, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చూడటం వల్ల కంటి ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోంది. అందువల్ల కంటి నొప్పి, వాపు మొదలైన సమస్యలు పెరుగుతున్నాయి. శరీరంలో టాక్సిన్స్ లేదా చెడు రక్తం అధిక స్థాయిలో ఉన్నప్పుడు కొంతమందికి కళ్ళు చీముతో నిండిపోతాయి. శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాలలో కన్ను ఒకటి. కానీ దాని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ టీవీ, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు చూడటం వల్ల కంటి ఆరోగ్యం వేగంగా క్షీణిస్తోంది. అందువల్ల కంటి నొప్పి, వాపు మొదలైన సమస్యలు పెరుగుతున్నాయి. శరీరంలో టాక్సిన్స్ లేదా చెడు రక్తం అధిక స్థాయిలో ఉన్నప్పుడు కొంతమందికి కళ్ళు చీముతో నిండిపోతాయి. దీనివల్ల విపరీతమైన నొప్పి, వాపు వస్తుంది. దీనినే కురు అంటారు. ఈ రకమైన కంటి సంబంధిత సమస్యలను నివారించడానికి రకరకాల ముందులు వాడుతుంటారు. వీటన్నింటికి బదులుగా కంటి సమస్యలను నివారించడానికి తల్లి పాలను ఉపయోగించవచ్చు. ఇది మీలో చాలా మందికి ఆశ్యర్యాన్ని కలిగించవచ్చు. కానీ అది నిజం. ఎక్కువ ఆసుపత్రులు, రవాణా సౌకర్యాలు లేని కాలంలో తలెత్తే ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి మన పూర్వీకులు ఎక్కువగా ఇంటి నివారణలను ఆశ్రయించేవారు. అవి ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ఆరోగ్య సమస్యకు పరిష్కారాన్ని అందించేవి. కానీ ఇప్పుడు వివిధ రకాల మందులు సులభంగా అందుబాటులో వచ్చాయి. దీంతో ఎవరూ ఈ ఇంటి నివారణలను ఉపయోగించడం లేదు. ముఖ్యంగా తల్లి పాలలో కూడా అనేక ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. తల్లి పాలు బిడ్డకు అమృతం లాంటివి. కానీ ఇది పిల్లలకు మాత్రమే కాకుండా కొన్ని ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి కూడా ఉపయోగపడతాయి. దీని ఔషధ గుణాలు కంటి సమస్యలను తక్షణమే నయం చేసే శక్తిని కలిగి ఉంటాయి. కంటి నొప్పి, దురద, మంట, కన్ను ఎర్రబడటం, కంటి ఇన్ఫెక్షన్లు వంటి వివిధ కంటి సంబంధిత సమస్యలను నివారించడానికి తల్లి పాలను ఉపయోగించవచ్చు. వీటిని కంటిలోకి పోయడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కంటిలో ఐదు లేదా ఆరు చుక్కలు వేయడం వల్ల కంటి సమస్యలు తొలగిపోతాయి. అయితే ఈ ఇంటి నివారణను ప్రయత్నించే ముందు వైద్యుడిని సంప్రదించడం మాత్రం మర్చిపోకూడదు. ఇలా చేసిన తర్వాత కూడా కంటి నొప్పి లేదా మంట తగ్గకపోతే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## ఆ సమయంలో భరించలేని కడుపు నొప్పి వేధిస్తుందా?



చాలా మంది అమ్మాయిలకు పీరియడ్స్ సమయంలో భరించలేనంత కడుపు నొప్పి వేధిస్తుంది. అంతేకాకుండా పీరియడ్స్ సమయంలో శరీరాలలో అనేక సమస్యలు కూడా తలెత్తుతాయి. అలాంటి సమయాల్లో వచ్చే సమస్యల్లో ఒకటి గ్యాస్ సమస్యలు. చాలా మంది అమ్మాయిలకు పీరియడ్స్ సమయంలో భరించలేనంత కడుపు నొప్పి వేధిస్తుంది. అంతేకాకుండా పీరియడ్స్ సమయంలో శరీరాలలో అనేక సమస్యలు కూడా తలెత్తుతాయి. అలాంటి సమయాల్లో వచ్చే సమస్యల్లో ఒకటి గ్యాస్ సమస్యలు. చాలా మందికి ఋతుస్రావం ప్రారంభమయ్యే రెండు రోజుల ముందు లేదా ఋతుస్రావం సమయంలో శరీరం అసౌకర్యంగా అనిపించడం, కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. అయితే కొన్ని ఆహారాలు తినడం వల్ల ఈ సమస్య నుండి ఉపశమనం పొందవచ్చు. పీరియడ్స్ సమయంలో బాదం తినవచ్చు. ఇందులో మెగ్నీషియం ఉంటుంది. ఇది అపానవాయువు, గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది. అలాగే దిగువ ఉదర కండరాలలో ఉద్రిక్తతను తగ్గిస్తుంది. అవకాడో, చిలగడదుంప, పాలకూర, అరటిపండ్లు వంటి కూరగాయలు, పండ్లు పీరియడ్స్ సమయంలో గ్యాస్ సమస్యలను తగ్గిస్తాయి. శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేస్తుంది. పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా కలిగిన పండ్లు తినడం ప్రయోజనకరంగా ఉంటుంది. ఫలితంగా శరీరంలో సోడియం పేరుకుపోదు. కడుపు ఉబ్బరం కూడా ఉండదు. పీరియడ్స్ సమయంలో అల్లం టీ తాగడం వల్ల వివిధ జీర్ణ సమస్యలు తొలగిపోతాయి. గ్యాస్ సమస్య తలెత్తదు. కానీ అల్లం టీ మాత్రమే కాదు, పుదీనా ఆకుల టీ కూడా తాగవచ్చు. ఇది పీరియడ్స్ సమయంలో గ్యాస్ సమస్యలను నివారించడానికి కూడా సహాయపడుతుంది. పీరియడ్స్ సమయంలో లేదా ముందు డార్క్ చాక్లెట్ నుంచి ఆపిల్,వివిధ బెర్రీల వరకు ఏదైనా తినవచ్చు. ఇవి గ్యాస్ సమస్యలను నివారించడానికి సహాయపడతాయి. పీరియడ్స్ సమయంలో ఓట్స్ వంటి ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు కూడా తినవచ్చు. అప్పుడు మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు ఉండవు.

## బెల్లం అన్నంతో బోలెడు లాభాలు



చాలా మంది స్వీట్స్ తినేందుకు ఇష్టపడుతూ ఉంటారు. ఇలా తినడం అస్సలు మంచిది కాదు..కానీ, స్వీట్ అంటే ఇష్టపడేవారు క్రమం తప్పకుండా బెల్లం అన్నం తింటే అద్భుతమైన ప్రయోజనాలు పొందుతారని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజు భోజనం చేశాక ఒక చిన్న బెల్లం ముక్కను నోట్లో వేసుకుంటే జీర్ణ సమస్యలతో పాటు..శరీరంలో అనేక రోగాలను దూరం చేస్తుందని చెబుతున్నారు. బెల్లంలో శరీరానికి అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా ఉంటాయి. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడానికి బెల్లం అద్భుతమేలు చేస్తుంది. బరువు తగ్గడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో బెల్లం ఎంతగానో ఉపయోగపడుతుంది. బెల్లం తరచూ తీసుకోవడం వల్ల శరీరంలో ఉండే వ్యర్థాలను బయటకు తోసేస్తుంది. బెల్లాన్ని ఉపయోగించి చేసే తీపి వంటకాలలో బెల్లం అన్నం కూడా ఒకటి. బెల్లం అన్నం తింటే శరీరానికి తగిన మోతాదులో శరీరానికి ఐరన్ లభిస్తుంది. ఇందులో కాల్షియంతో పాటు ఇతర పోషకాలు లభిస్తాయి. ఇవి ఎముకల సమస్యల నుంచి విముక్తి కలిగిస్తాయి. అలాగే ఈ బెల్లం అన్నం తింటే హిమోగ్లోబిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. బెల్లం అన్నం తింటే అందులో ఉండే పొటాషియం శరీరానికి లభించి.. రక్తపోటును నియంత్రిస్తుంది. ప్రతి రోజూ ఒక చిన్న ముక్క బెల్లం తిన్న కూడా దాని ఫలితం ఉంటుంది. అలసట తగ్గుతుంది. తక్షణ శక్తి లభిస్తుంది. శరీరంలో ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. కీళ్లనొప్పులు, జాయింట్ పెయినస్‌తో బాధపడుతున్న వారికి బెల్లం, బెల్లం అన్నం తరచూ తీసుకోవటం మంచిది. ఇందులో కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. దీని వల్ల ఎముకలు బలంగా ఆరోగ్యంగా మారతాయి. బెల్లంలోని గుణాలు జాయింట్ పెయిన్స్‌ని దూరం చేస్తుంది. అలాగే ఇందులో బెల్లం అన్నం తినటం వల్ల శరీరానికి అవసరమైన ఫాస్పరస్ శక్తి ఉత్పత్తికి దోహదం చేస్తుంది. అలాగే బెల్లంలో లభించే మాంగనీస్, జింక్, రాగి అనేక రకాల అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అయితే ఈ బెల్లం అన్నం తినేవారు అతిగా తినకపోవడం చాలా మంచిది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు బెల్లం అన్నం తికపోవడం చాలా మంచిది.

## కీర దోస తిన్నాక వీటిని తిన్నారంటే..



ఏడాది పొడవునా మార్కెట్లో లభించే అద్భుత ఆహారం కీర. వేసవిలో కీరదోస తినడం శరీరానికి చాలా మంచిది. ఇందులో దాదాపు 95% నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. కీరదోస ఏడాది పొడవునా మార్కెట్లో లభించే అద్భుత ఆహారం. వేసవిలో కీరదోస తినడం శరీరానికి చాలా మంచిది. ఇందులో దాదాపు 95% నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. కీరదోస వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దీనిని తప్పుడు మార్గంలో తినడం శరీరానికి లభం కన్నా హానికరం అధికమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కీరదోసలో పొటాషియం, మాంగనీస్, కాల్షియం, భాస్వరం, విటమిన్లు ఎ, బి, సి, కె వంటి పోషకాలు ఉంటాయి. ఇది శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా దీనిని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని మెరుగుపరుస్తుంది. కీరదోస వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ దీనిని తిన్న తర్వాత పాలు తాగడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలు వస్తాయి. అలాగే కీరదోస తిన్న తర్వాత నారింజ, నిమ్మకాయలు, ద్రాక్ష వంటి పండ్లు తినడం మంచిది కాదు. దీనివల్ల కడుపులో గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు వస్తాయి. అరటిపండ్లు, కీరదోస రెండూ తినడం వల్ల చలిగా అనిపించవచ్చు. లేదా కీరదోస తిన్న వెంటనే అరటిపండ్లు తినడం మంచిది కాదు. దీనివల్ల జలుబు వచ్చే అవకాశం పెరుగుతుంది. కడుపులో శ్లేష్మం ఏర్పడుతుంది. కీరదోస తిన్న వెంటనే నీరు తాగటం కూడా మంచిదికాదు. ఎందుకంటే కీరదోసలో దాదాపు 95 శాతం నీరు ఉంటుంది. అందువల్ల కీరదోస తిన్న తర్వాత నీరు తాగడం వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి.

## బిజినెస్

### రూ.5,048 కోట్ల లాభాలు




గడిచిన ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) నికర లాభాలు 3 శాతం వృద్ధితో రూ.5,048 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.4,886 కోట్ల లాభాలు నమోదు చేసింది. ప్రభుత్వ రంగంలోని బిఒబి 2024–25కు గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.8.35 డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు రికార్డ్ తేదిని 2025 జూన్ 6గా తీసుకుంది. గడిచిన క్యూ4లో బ్యాంక్ వడ్డీ ఆదాయం 3.6 శాతం పెరిగి రూ.29,583.40 కోట్లుగా చోటు చేసుకుంది. మార్కెట్ కాపిటలైజేషన్ ప్రకారం.. రెండో అతిపెద్ద పిఎస్‌యు బ్యాంక్ అయినా బిఒబి క్రితం మార్చి త్రైమాసికంలో వడ్డీ వ్యయం 10 శాతం పెరిగి రూ.19,622.39 కోట్లకు చేరింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 2.26 శాతానికి దిగివచ్చాయి. గతేడాది ఇదే త్రైమాసికం నాటికి 2.92 శాతం జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. ఇదే సమయంలో నికర నిరర్ధక ఆస్తులు 0.68 శాతంగా ఉండగా.. గడిచిన మార్చి ముగింపు నాటికి 10 బేసిస్ పాయింట్లు తగ్గి 0.58 శాతంగా నమోదయ్యింది. మొత్తం డిపాజిట్లు 10.3 శాతం పెరిగి రూ.14,72,035 కోట్లకు చేరాయి. గృహ రుణాలు 17.3 శాతం పెరిగి రూ.1,31,123 కోట్లకు చేరగా.. వాహన రుణాలు 20.3 శాతం పెరిగి రూ.46,549 కోట్లుగా నమోదయ్యాయి.

### రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ లవర్స్‌కు బ్యాడ్ న్యూస్..



రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 ఒక రిఫైన్డ్ 440ఎఎ నూా ఇంజన్‌తో వస్తుంది. ఇది శక్తివంతమైన లో–ఎండ్ టార్క్‌ను అందించగలదు. స్క్రామ్ 411తో పోలిస్తే, ఇందులో 6–స్పీడ్ గేర్‌బాక్స్ ఉంది. రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 బైక్‌కు సంబంధించి కస్టమర్లకు ఆందోళన కలిగించే వార్త వచ్చింది. కంపెనీ ఈ మోడల్ బుకింగ్, విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసింది. నిజానికి చాలా మంది యూజర్లు బైక్ కొంత సమయం నడిచిన తర్వాత మళ్లీ స్టార్ట్ కాకుండా ఉందని ఫిర్యాదు చేశారు. స్క్రామ్ 440ని ఈ ఏడాది జనవరిలో లాంచ్ చేశారు. ఇది స్క్రామ్ 411 అప్‌డేటెడ్ వెర్షన్. ఇది హార్లే డేవిడ్‌సన్ ఞ440, ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400ఞ వంటి బైక్‌లతో నేరుగా పోటీపడుతుంది. కంపెనీ ఈ సాంకేతిక సమస్యను సరిచేయడానికి త్వరలో రీకాల్ ప్రకటించవచ్చని భావిస్తున్నారు. ఈ సమస్య స్క్రామ్ 440 అన్ని యూనిట్లలో కాకుండా సుమారు 2% యూనిట్లలో మాత్రమే ఉందని కంపెనీ స్పష్టం చేసింది. అయినప్పటికీ కస్టమర్ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని కంపెనీ తాత్కాలికంగా దీని విక్రయాలను నిలిపివేసింది. సమాచారం ప్రకారం.., ఈ ఇంజన్ వైఫల్యం మాగ్నెటోలో ఉన్న వుడ్‌రఫ్‌కీ కి సంబంధించినది. ఇది చిన్నది కానీ ముఖ్యమైన కాంపోనెంట్. ఇది ఇంజన్ రొటేషన్ మెకానిజంలో సహాయపడుతుంది. ఈ కీ సరిగ్గా పనిచేయకపోతే ఇంజన్ క్రాంక్ చేసిన తర్వాత కూడా స్టార్ట్ కాదు. ఈ సమస్య ముఖ్యంగా బైక్‌ను కొంత సమయం ఆపి మళ్లీ స్టార్ట్ చేయడానికి ప్రయత్నించినప్పుడు ఎక్కువగా కనిపించింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఈ సమస్యను తీవ్రంగా పరిగణిస్తూ సంభావ్య రీకాల్ ప్రక్రియపై కూడా ఆలోచిస్తోంది. అలాగే, ప్రభావిత యూనిట్ల కస్టమర్లను వ్యక్తిగతంగా సంప్రదిస్తూ వారిని సర్వీస్ సెంటర్‌కు పిలిచి ఉచిత రిపేర్ ఆఫర్ అందిస్తోంది. బైక్ సైడ్ కవర్, మాగ్నెటో కవర్‌ను తెరిచి వుడ్‌రఫ్ కీని మార్చే ప్రక్రియకు సుమారు 1–2 గంటల సమయం పట్టవచ్చు. కంపెనీ అవసరమైన స్పేర్ పార్ట్‌లను ఇప్పటికే డీలర్‌షిప్‌లకు పంపింది. తద్వారా రిపేర్ పనిలో ఆలస్యం జరగదు.


# జీఎస్టీ లేకుండా దుబాయ్ రేట్లకు చీప్‌గా బంగారం ఎలా కొనాలి?



హైదరాబాద్‌లో 22 క్యారెట్ బంగారం తులం ధర ఇటీవల కొండెక్కిన సంగతి తెలిసిందే. రూ. లక్షకు చేరువై తిరిగి పెరుగుతూ తగ్గుతూ ఊగిసలాడుతోంది. ఆభరణాల కొనుగోలు సమయంలో మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ, తరుగు ఛార్జీలు కలిసి మొత్తం ఖర్చును మరింత పెంచుతాయి. భారతదేశంలో బంగారం కేవలం పెట్టుబడి కాదు, సంస్కృతి, సంప్రదాయాలతో లోతుగా ముడిపడిన భాగం. ముఖ్యంగా మహిళలు పండుగలు, వివాహాలు, శుభ సందర్భాలలో బంగారు ఆభరణాలను కొనుగోలు చేసి ధరించడానికి ఆసక్తి చూపిస్తారు. ఈ సాంప్రదాయం బంగారం డిమాండ్‌ను ఎప్పటికీ ఉన్నత స్థాయిలో ఉంచుతుంది. అయితే, భారత్‌లో బంగారం ధరలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేయడం భారతీయులకు ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది, ఎందుకంటే అక్కడ బంగారం స్వచ్ఛత ఉన్నతంగా ఉండడమే కాకుండా ధరలు రీజనబుల్ గా తక్కువగా ఉంటాయి. అదనంగా, దుబాయ్‌లో బంగారం కొనుగోలుపై పన్నులు లేకపోవడం, దిగుమతి సుంకాలు అవసరం లేకపోవడం, పోటీతత్వం వల్ల అందించే ఆఫర్లు దీనిని మరింత లాభదాయకంగా చేస్తాయి. ఈ కారణాల వల్ల చాలా మంది దుబాయ్ నుంచి బంగారం తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తారు, కొందరు చట్టవిరుద్ధ మార్గాలను కూడా ఎంచుకుంటారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) నిబంధనల ప్రకారం, దుబాయ్‌లో 6 నెలలకు పైగా నివసించిన వ్యక్తులు కస్టమ్స్ డ్యూటీ చెల్లించి 1 కిలో వరకు బంగారాన్ని తమ బ్యాగేజీలో తీసుకురావచ్చు. ఈ పరిమితిని దాటితే, బంగారం సుంకం చెల్లించినదిగా (డ్యూటబుల్ గోల్డ్) నిరూపించి, రెడ్ ఛానెల్ ద్వారా కస్టమ్స్ విధానాలను పాటించాలి. ప్రస్తుతం భారత్‌లో బంగారం దిగుమతి సుంకం 6% గా ఉంది, దీనిని కొందరు తప్పించుకునేందుకు స్మగ్లింగ్‌కు ప్రయత్నిస్తారు, ఇటీవల కన్నడ నటి రన్యా రావు 14 కిలోల బంగారంతో బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన సంఘటన దీనికి ఉదాహరణ. కస్టమ్స్ సుంకం చెల్లించకుండా కూడా కొంత పరిమాణంలో బంగారం తీసుకురావచ్చు, అయితే దీనికి నిర్దిష్ట పరిమితులు ఉన్నాయి. పురుషులు రూ. 50,000 విలువ కలిగిన 20 గ్రాముల వరకు బంగారాన్ని (బార్లు లేదా నాణేల రూపంలో) తీసుకురావచ్చు. మహిళలు రూ. 1 లక్ష విలువ కలిగిన 40 గ్రాముల వరకు బంగారాన్ని (ఆభరణాలు, బార్లు లేదా నాణేల రూపంలో) వ్యక్తిగత వినియోగం కోసం తీసుకురావచ్చు. 15 ఏళ్ల లోపు పిల్లలు కూడా 40 గ్రాముల వరకు బంగారాన్ని (నగలు లేదా బహుమతుల రూపంలో) సుంకం లేకుండా తీసుకురావచ్చు. అయితే, కస్టమ్స్ అధికారులు బంగారం కొనుగోలు వివరాలు, రసీదులు, పిల్లల విషయంలో తల్లిదండ్రుల గుర్తింపు వంటి డాక్యుమెంట్లను పరిశీలిస్తారు. దుబాయ్ నుంచి బంగారం తెచ్చేటప్పుడు చట్టబద్ధమైన మార్గాలను అనుసరించడం ముఖ్యం. హాల్‌మార్క్ ఉన్న బంగారాన్ని కొనుగోలు చేయడం, కొనుగోలు రసీదులను సురక్షితంగా ఉంచడం అవసరం. స్మగ్లింగ్ వంటి అక్రమ మార్గాలు చట్టపరమైన ఇబ్బందులు, జరిమానాలు లేదా జైలు శిక్షకు దారితీయవచ్చు. బంగారం కొనుగోలు సమయంలో దుబాయ్‌లో అందుబాటులో ఉన్న ఆఫర్లు, సీజనల్ డిస్కౌంట్లను వినియోగించుకోవడం ద్వారా ఖర్చును మరింత తగ్గించుకోవచ్చు. ఈ నిబంధనలను గమనిస్తూ, సరైన ప్రణాళికతో దుబాయ్ నుంచి బంగారం తెచ్చుకోవడం ఆర్థికంగా, సాంస్కృతికంగా లాభదాయకంగా ఉంటుంది.

### ఎలక్ట్రిక్ కారు కొనాలనుకునేవారికి బెస్ట్ ఆప్షన్లు..

మన దేశంలో ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్ పెరుగుతోంది. నెమ్మదిగా పర్యావరణ హిత వాహనాలు తమ ముద్ర వేస్తున్నాయి. అనేక రకాల మోడళ్లు మన దేశంలో అందుబాటులో ఉంటున్నాయి. ముఖ్యంగా సంప్రదాయ పెట్రోల్ డీజిల్ వాహనాల ధరలు పెరుగుతుండటం, వాటి మెయింటెనెన్స్ అధికమవడంతో పాటు పెట్రోల్ రేట్లు కూడా భారీ పెరగడంతో అందరూ ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారు. చాలా మంది ఈ కార్లపై అనేక రకాల సందేహాలు వ్యక్తపరుస్తున్నప్పటికీ వాటి సేల్స్ మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. అందుకు ప్రధాన కారణం అవి మెయింటెనెన్స్ ఫ్రీ కావడంతో పాటు పూర్తి పర్యావరణ హితం కావడమే. అయితే వీటి ధరలు కాస్త ఎక్కువగానే ఉంటున్నాయి. అయితే రూ. 10లక్షల లోపు కూడా మంచి బ్రాండ్ ఎలక్ట్రిక్ కార్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో టాటా మోటార్స్, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ వంటివి ఉన్నాయి. భారతదేశంలో అత్యంత చవకైన ఎలక్ట్రిక్ కారు ఎంజీ కామెట్ ఈవీ. ఇది రూ. 7 లక్షల (ఎక్స్–షోరూమ్) ప్రారంభ ధరకు అందుబాటులో ఉంది. దీనిలో బ్యాటరీ–యాజ్–ఎ–సర్వీస్ (బీఏఏఎస్) ఎంపికతో వస్తుంది. ఇది మరింత సరసమైనదిగా చేస్తుంది. ఎంజీ కామెట్ ఈవీ ఒక కాంపాక్ట్ డిజైన్‌ను కలిగి ఉంటుంది. ఇది



నగర ట్రాఫిక్ లో ప్రయాణించడానికి అనువుగా ఉంటుంది. అంతేకాక రద్దీగా ఉండే ప్రదేశాలలో ఎక్కువ ఇబ్బంది లేకుండా పార్క్ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ ఈవీ హైవే డ్రైవింగ్‌కు తగినది కానప్పటికీ, నగరంలో, చుట్టుపక్కల రోజువారీ ప్రయాణానికి బెస్ట్ ఎంపికగా ఉంటుంది. క్యాబిన్ లోపల ఉన్న అనేక రకాల అప్ గ్రేడెడ్ ఫీచర్లు ఉంటాయి. ఇవి ఈ కారును మరింత ఆకర్షణీయంగా మారుస్తాయి. ఈ కారు భారతదేశంలో రెండవ అత్యంత సరసమైన ఎలక్ట్రిక్ కారు. అలాగే ఇది దేశంలోనే అత్యంత సరసమైన టాటా ఎలక్ట్రిక్ కారు కూడా. ఇది రూ. 7.99 లక్షల (ఎక్స్–షోరూమ్) ప్రారంభ ధరకు అందుబాటులో ఉంది. టాటా టియాగో ఈవీ ఒక కాంపాక్ట్ డిజైన్‌తో వస్తుంది. ఇది నగరంలో, చుట్టుపక్కల రోజువారీ ప్రయాణానికి ఉద్దేశించిన సరసమైన, డబ్బుకు విలువైన ఈవీ కోసం చూస్తున్న వినియోగదారులకు ఆచరణాత్మక ఎలక్ట్రిక్ కారుగా ఉండటానికి వీలు కల్పిస్తుంది. టియాగో ఈవీ ఒకే చార్జ్‌పై 315 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలగుతుంది.

# దేశ ప్రజలే భారతమాతకు రక్షణ కవచం..
# భారత బలగాలపై క్రికెటర్ సచిన్ ప్రశంసలు

పహల్గాం ఉగ్రదాడి కి ప్రతీకారంగా భారత్ బలగాలు బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సింధూర్ నిర్వహించాయి. ఆ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్ లోని మొత్తం 9 ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు దాడులు చేసి పదుల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. బలగాలు విజయవంతగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌పై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సచిన్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఐకమత్యంలో భయం ఉండదని, బలానికి ఎల్లలు లేవని, దేశ ప్రజలే భారత మాతకు రక్షణ కవచమని సచిన్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రపంచంలో ఉగ్రవాదానికి తావు లేదని, మనమంతా ఒక జట్టని అన్నారు. కాగా సచిన్ టెండూల్కర్ సందర్భం వచ్చిన ప్రతిసారి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మాట్లాడారు. 2008 నవంబర్ 26న జరిగిన ఉగ్రదాడిపై కూడా సచిన్ స్పందించారు. అప్పుడు ఆయన ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ ఒక పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చారు. 'నా అభిప్రాయంలో ఇది దేశంపై జరిగిన దాడి. ఇది ప్రతి భారతీయుడి హృదయాన్ని



దెబ్బతీసింది. ఇది కేవలం ముంబై ప్రజలపై దాడి కాదు.' అని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో సచిన్ ఇంగ్లండ్‌పై సెంచరీ చేశారు. ఆ సెంచరీని ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు.

### ముంబై ఇండియన్స్‌పై ఎఫెక్ట్

ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ ముంబై ఇండియన్స్‌పై పడింది. తమ తదుపరి మ్యాచ్ కోసం ముంబై ఇండియన్స్ ఇవాళ (మే 7) సాయంత్రం ముంబై నుంచి చండీఘడ్ మీదుగా ధర్మశాలకు ప్రయాణించాల్సి ఉంది. అయితే ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల నేపథ్యంలో ముంబై ఇండియన్స్ ధర్మశాల ప్రయాణం వాయిదా పడింది. భారత ప్రభుత్వం సూచనల మేరకు చండీఘడ్ సహా దేశంలో పలు విమానాశ్రయాలు మూసివేశారు. చాలా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇందులో ముంబై ఇండియన్స్ ప్రయాణించాల్సిన విమాన సర్వీస్ కూడా ఉంది. బీసీసీఐ నుంచి తదుపరి సూచనలు వచ్చే వరకు ముంబై ఇండియన్స్ జట్టు ముంబైలోనే ఉండనుంది. ఈ నెల 11న ముంబై ఇండియన్స్ ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్ కోసమే వారు ధర్మశాల ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఈ లోపే విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరోవైపు ధర్మశాలలో రేపు (మే 8) ఓ మ్యాచ్ జరుగనుంది. ఢిల్లీ క్యాపిటల్స్.. పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం ఇరు జట్లు ఇదివరకే ధర్మశాలకు చేరుకున్నాయి. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ దాడులకు తెగబడే అవకాశం ఉండటంతో భారత ప్రభుత్వం పలు విమానాశ్రయాలను మూసి వేయాలని సూచించింది. అయితే దీని ప్రభావం? ఐపీఎల్ పడే అవకాశం ఉంది. ఐపీఎల్ మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారం సాగాలంటే ఆయా జట్లు ఓ వేదిక నుంచి మరో వేదికకు విమానాల ద్వారా ప్రయాణించాల్సి ఉంది. దేశంలో పలు విమానాశ్రయాలు మూసివేసిన నేపథ్యంలో జట్ల ప్రయాణానికి ఆటంకం కలుగవచ్చు. దీని ప్రభావం ఐపీఎల్ షెడ్యూల్‌పై పడే అవకాశం ఉంది.



స్పందించిన బీసీసీఐ షెడ్యూల్ మార్పు అంశంపై బీసీసీఐ వర్గాలు స్పందించాయి. షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశాయి. ఈ విషయంపై బీసీసీఐ వర్గాలు ఇండియా టుడేతో మాట్లాడుతూ.. "పరిస్థితులను బీసీసీఐ నిశితంగా గమనిస్తోంది. ఇప్పటికైతే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఐపీఎల్ మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తాం" అని పేర్కొన్నాయి. ముంబై ఇండియన్స్ –గుజరాత్ టైటాన్స్ మధ్య నిన్న (మే 6) జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగింది. ఈ మ్యాచ్ ముగిసిన కాసేపటికే భారత సైన్యం పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లో ఉన్న ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో గత నెల 22వ తేదీన పాక్ ఉగ్రమూకలు దాడులకు తెగబడి 26 మంది అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్నారు. దీనికి బదులుగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్‌కు బుద్ధి చెప్పింది. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి.

## స్పోర్ట్స్

### ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే జడేజా!



ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆల్ రౌండర్స్ జాబితాలో భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏకంగా 400 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అయితే బంగ్లాదేశ్ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని రెండో స్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ అఫీషియల్ వెబ్‌సైట్‌లో బుధవారం తాజా ర్యాంకింగ్స్‌ను పొందుపర్చారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో మిరాజ్ 116 పరుగులు రాబట్టడమేగాక, 15 వికెట్లు తీశాడు. దాంతో ఆల్‌రౌండర్స్ జాబితాలో అతను ఒక స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. అంతేగాక రెండో టెస్టులో సెంచరీ ద్వారా మిరాజ్.. ఐసీసీ బ్యాటర్స్ జాబితాలో కూడా 8 స్థానాలు మెరుగుపర్చుకుని 55వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్ జోయ్ రూట్ ఈసారి కూడా టాప్–20లో చోటు దక్కించుకోలేకపోయారు. అయితే జింబాబ్వే లెఫ్ట్ హ్యాండర్ సీన్ విలియమ్స్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 19వ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో బంగ్లాదేశ్‌కు చెందిన షడ్మాన్ ఇస్లామ్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపర్చుకుని 60వ స్థానానికి దూసుకెళ్లాడు. మిరాజ్ టెస్టు బౌలర్స్ విభాగంలో కూడా రెండు స్థానాలు మెరుపర్చుకుని 24వ స్థానానికి వెళ్లాడు.




## మాల్దీవుల్లో ఎంజాయ్ చేస్తూ అందాలతో అదరగొడుతున్న నికిత శర్మ




## డేటింగ్‌లో భాగ్య శ్రీ బోర్సే, రామ్

మాస్ మహరాజా రవితేజ హీరోయిన్ భాగ్య శ్రీ భోర్సే గురించి తెలుగు ప్రేక్షకులకి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులని పలకరించింది ఈ చిన్నది. మరాఠి బ్యూటీ భాగ్యశ్రీ భోర్సే కి తొలి సినిమా భారీ డిజాస్టర్ అయినా అమ్మడు మాత్రం ఓవర్‌నైట్ స్టార్ అయింది. దాంతో ఒక్కసారిగా అవకాశాలు వెల్లువలా వస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ దేవరకొండ నటిస్తున్నకింగ్ డమ్ , దుల్కర్ సల్మాన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న కాంత వంటి చిత్రాల్లోనూ నటిస్తున్నారు. దీంతో పాటు మరో రెండు చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి.ఒకవైపు తన గ్లామర్ తో , మరోవైపు డేటింగ్ రూమర్స్ తో భాగ్యశ్రీ ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతూ ఉంటుంది. గత కొద్ది రోజులుగా భాగ్య శ్రీ బోర్సే, రామ్ డేటింగ్‌లో ఉన్నారంటూ అనేక ప్రచారాలు జరుగుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. వీరిద్దరూ రాపో 22 సినిమాలో నటిస్తున్నారు. షూటింగ్ సమయంలో వీరి మధ్య ప్రేమ చిగురించిందని అనేక ప్రచారాలు జరుగుతున్నా దానిపై క్లారిటీ లేదు. తాజాగా రామ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా రాపో 22 సినిమాలో భాగ్య శ్రీ ఫోటోని షేర్ చేస్తూ.. హ్యాపీ బర్త్ డే BB! ఈ ఏడాది నీకు ప్రేమ, విజయాలు, సంతోషం దక్కుతాయని ఆశిస్తున్నా. అందుకు నువ్వు అర్హురాలివి. Love n Luck RAPO' అని రామ్ పోస్ట్ చేశారు .



## మరాఠా ధీశాలి రాణి 'అహల్యా బాయి' జీవితంపై సినిమా



రాణి అహల్యా బాయి హెూల్కర్ జీవితంపై సినిమా నిర్మించబోతున్నట్లు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అధికారికంగా ప్రకటించారు. చాలాకాలంగా ఆమె జీవితాన్ని నేటి తరం యువతకు పరిచయం చేయాలని తాము అనుకుంటున్నట్లు ఆయన అన్నారు. మరాఠ ధీశాలి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని ఆయన తెలిపారు. రాణి అహల్యా బాయి 300వ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలను చేపట్టామని సీఎం అన్నారు. గతంలోనే అహ్మద్‌నగర్ జిల్లా పేరును అహల్యానగర్ గా మార్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అహల్యా బాయి మరాఠాలు పాలించిన మాల్వా సామ్రాజ్యపు హెూల్కరు వంశానికి చెందిన రాణి అని సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. గతంలో ఆమె గురించి ఆయన ఇలా చెప్పారు. 'ప్రస్తుత అహ్మద్‌నగర్ జిల్లాలోని చౌంధీ అనే గ్రమంలో ఆమె జన్మించారు. మహిళా అభ్యుదయవాదిగా దేశం కోసం ఆమె ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నో దేవాలయాలతో పాటు ధర్మశాలలను ఆమె నిర్మించారు. ఆమె కారణం వల్లే నేడు కాశీలో మహాశివుడి గుడి ఉంది.' అని ఒక వేదికపై దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. అందుకే ఆమె జీవితాన్ని సినిమాగా దేశ ప్రజలకు చూపించాలని అనుకున్నట్లు ఆయన అన్నారు. దేశంలోని అన్ని భాషల్లో అహల్యా బాయి జీవిత చరిత్ర విడుదల అవుతుందన్నారు. రీసెంట్‌గా ఛావా సినిమాతో మరాఠా యోధుడు శంభాజీ మహారాజ్ గురించి దేశం మొత్తం తెలుసుకుంది. ఇప్పుడు అదే ప్రాంతం నుంచి రాణి అహల్యా బాయి గురించి సినిమా ప్రకటన రావడంతో దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రయుల్లో ఆసక్తి కలుగుతుంది. త్వరలో ప్రారంభం కానున్న ఈ మూవీ గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సినిమా నిర్మించేందుకు ఏకంగా మహారాష్ట్ర ప్రభుత్వమే ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

## దేశం పిలిచినప్పుడు.. భారతసైన్యం వస్తుంది

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి చర్యకు సంబంధించి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి 1.44 గంటలకు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. పాకిస్థాన్ దాదాపు 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి చేయగా.. ఇందులో 70 మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. అయితే భారత సైన్యం చేసిన ఆపరేషన్‌పై ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. మేమంతా మీ వెంటే ఉంటామంటూ భారత సైన్యానికి మద్దతుగా పోస్ట్‌లు పెడుతున్నారు. తాజాగా మలయాళ నటుడు మమ్ముట్టి కూడా ఈ ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించాడు. నిజమైన హీరోలకు వందనం! దేశం పిలిచినప్పుడు భారతసైన్యం వస్తుందని ఆపరేషన్ సింధూర్ మరోసారి రుజువు చేసింది. ప్రాణాలను కాపాడినందుకు, ఆశను నిలిపినందుకు మీకు ధన్యవాదాలు. మీరు దేశాన్ని గర్వపడేలా చేశారు. జై హింద్! అంటూ మమ్ముట్టి రాసుకోచ్చాడు.



## ఆ మార్పు కి నేను సిద్ధంగా ఉన్నాను: హీరో శ్రీవిష్ణు

'నేను ఇండస్ట్రీకి వచ్చి పదహారేళ్ల అవుతుంది. ఈ పదహారేళ్లలో ఎక్కడ కూడా బోర్ కొట్టించని సినిమాలే చేశానని భావిస్తున్నాను. రానున్న రొజులలో చాలా మార్పులు రాబోతున్నాయి. పెద్ద రెవల్యూషన్ రాబోతుంది. నెక్ట్స్ జనరేషన్ కిడ్స్ రాబోతున్నారు. ఆ మార్పు కి నేను సిద్ధంగా ఉన్నాను. ప్రతి క్యారెక్టర్ లో ది బెస్ట్ ఇచ్చుకుంటూ వెళ్తున్నాను' అన్నారు హీరో శ్రీవిష్ణు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం చసింగిల్ కేతిక శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి కార్తిక్ రాజు దర్శకత్వం వహించారు. మే9న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా హీరో శ్రీవిష్ణు మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు.. డైరెక్టర్ కార్తీక్ రాజు ఈ సినిమా కథ చెప్పినప్పుడు చాలా మంచి ఎంటర్టైనర్ అవుతుందని నమ్మకం కలిగింది. ఫైనల్ గా సినిమా చూసుకున్న తర్వాత చాలా పెద్ద ఎంటర్టైనర్ అవుతుందని అనిపించింది.ఇప్పటివరకు విడుదలైన టీజర్ ట్రైలర్ పాటలకి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రమోషన్స్ కూడా చాలా పాజిటివ్ గా ఉన్నాయి. ఇదంతా టీమ్ ఎఫర్ట్ అని భావిస్తున్నాను. ఈ సినిమా క్లైమాక్స్ కొత్తగా ఉంటుంది. నా క్యారెక్టర్, వెన్నెల కిషోర్ గారి క్యారెక్టర్. ఇద్దరు హీరోయిన్స్ క్యారెక్టర్స్ ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ నాలుగు క్యారెక్టర్లు కూడా ఆడియన్స్ కి చాలా నచ్చుతాయి. క్లైమాక్స్ చాలా యూనిక్ గా ఉంటుంది. అందరిని ఎంటర్టైన్ చేస్తుంది. సినిమాని కంప్లీట్ గా హైదరాబాద్ లో తీసాం. హైదరాబాద్‌ని చాలా కొత్తగా చూపించాం. ఈ మధ్యకాలంలో హైదరాబాద్ ని ఇంత కొత్తగా ఎవరు చూపించలేదు. చాలా బెస్ట్ మూమెంట్స్ ని క్యాప్చర్ చేశాం. నేను ప్రతి క్యారెక్టర్ నీ ఎంజాయ్ చేస్తాను. డైరెక్టర్ తోనే ఎక్కువ ట్రావెల్ చేస్తాను. ఆ ట్రావెల్ లోనే 50% వచ్చేస్తుంది. తర్వాత లొకేషన్ లో ఇంకొంత క్యారెక్టర్ మీద కమాండ్ పెరుగుతుంది. ఈ సినిమాలో నా బాడీ లాంగ్వేజ్ కొత్తగా ఉంటుంది. ఇందులో లవ్‌స్టోరీ ఉంటుంది. దానికి తగ్గట్లుగానే నా బాడీ లాంగ్వేజ్ ఉంటుంది. గత చిత్రాలతో పోల్చుకుంటే ఈ సినిమాలో ఒక డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్ ఆడియన్స్ చూస్తారు. సినిమా ఒక హైపర్ ఎనర్జీతో వచ్చింది. దానికి తగ్గట్టు విశాల్ చంద్రశేఖర్ ఎనర్జిటిక్ సాంగ్స్ ఇచ్చారు. ఆర్ఆర్ చాలా బాగా చేశారు. చాలా కొత్తగా ఉంటుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com